# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**


సంపుటి :01 సంచిక: 121 ఆదివారం 25 జూన్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## బ్యాంకులకు చేరిన 99 వేల కోట్ల 2 వేల నోట్లు

**ముంబై :**



2 వేల రూపాయల నోట్ల విత్ డ్రా ప్రారంభమై సరిగ్గా నెల రోజులైంది. ఈ నెల రోజుల్లో, చలామణీలో ఉన్న రూ.2,000 కరెన్సీ నోట్లలో 72% పైగా నోట్లు బ్యాంకులను టచ్ చేశాయి. జనం వాటిని డిపాజిట్ చేశారు/చిన్న నోట్లుగా మార్చుకుని తిరిగి తీసుకున్నారు.2023 మే 19న, రూ.2,000 కరెన్సీ నోట్లను మార్కెట్ నుంచి వెనక్కు తీసుకుంటున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ప్రజల వద్ద ఉన్న రూ.2,000 నోట్లను బ్యాంక్‌ల్లో మార్చుకోవడానికి 23 మే 2023 నుంచి అనుమతించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30లోగా, పింక్ నోట్లను బ్యాంక్ అకౌంట్లలో జమ చేయడం లేదా మార్చుకోవచ్చు. 2023 మార్చి చివరి నాటికి, భారతదేశంలో రూ.3.7 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు చలామణీలో ఉన్నాయి. చలామణీలో ఉన్న మొత్తం కరెన్సీలో రూ.2 వేల నోట్ల వాటా 10.8%. పింక్ కరెన్సీ నోట్లను రిజర్వ్ బ్యాంక్ ఉపసంహరించుకుంది తప్ప రద్దు చేయలేదు. కాబట్టి, ఇప్పటికీ రూ.2000 నోట్లు చట్టబద్ధమైన కరెన్సీనే. వాటిని బ్యాంక్‌ల్లో డిపాజిట్ చేయడంతో పాటు, అన్ని రకాల కొనుగోళ్ల కోసం జనం వాడుతున్నారు. వాస్తవానికి, 2 వేల రూపాయల నోట్ల ఉపసంహరణ తర్వాత డిజిటల్ ట్రాన్జాక్షన్లు కొద్దిగా తగ్గాయి. చాలా వస్తువులు, సర్వీస్‌లను క్యాష్‌తోనే కొంటున్నారు. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ జొమాటోలో క్యాష్ ఆన్ డెలివరీ ఆప్షన్‌ను ఎంచుకున్న వారిలో దాదాపు 75 శాతం మంది రూ.2,000 నోట్లతోనే పేమెంట్స్ చేస్తున్నారు. పెట్రోల్ పంపుల్లోనూ క్యాష్ డీలింగ్స్ వేగంగా పెరిగాయి. ట్యాంక్ ఫుల్ చేయిస్తున్న బండి ఓనర్లు, బిల్లు చెల్లించడానికి రూ.2000 నోట్లను ఉపయోగిస్తున్నారు. గతంలో, పెట్రోల్ బంకుల్లో డైలీ విక్రయాల్లో డిజిటల్ పేమెంట్స్ 40 శాతం ఉంటే, ఇప్పుడు 10 శాతానికి తగ్గాయి. ూఃఎ రిపోర్ట్ ప్రకారం.. ఈ-కామర్స్, ఫుడ్, ఆన్‌లైన్ కిరాణాల్లో

02

## నాసాతో కలిసి ఇస్రో....ఆర్టెమిస్

**బెంగళూరు :**



అమెరికా, రష్యా సహా ఇతర దేశాలు అంతరిక్షంలో ఏర్పాటు చేసిన స్పేస్ సెంటర్ పై ఇస్రో బలమైన ముద్ర వేసేందుకు సిద్ధమైంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాతో కలసి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సంయుక్త మిషన్ త్వరలో సాకారమవుతుంది. భారత ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఈ మిషన్ గురించి అమెరికా అధికారులు ప్రకటించడం గమనార్హం. 2024లో ఈ మిషన్ సాకారమవుతుందని తెలుస్తోంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో.. రాకెట్ ప్రయోగంలో ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచింది. అనేక ఇతర దేశాలు తమ శాటిలైట్ల ప్రయోగానికి ఇస్రో సహాయ సహకారాలు తీసుకుంటున్నాయి. సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించిన ఇస్రోకి ఇప్పుడు నాసా టెక్నాలజీ మరింత దన్నుగా నిలవబోతోంది. 2024లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి

02



## మోడీకి టీషర్ట్ గిఫ్ట్...

**న్యూయార్క్:**

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాని మోదీకి ఓ స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. అమెరికా పర్యటన ముగిసిన సందర్భంగా ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఓ టీషర్ట్ ని మోదీకి అందజేశారు. హిస్టారికల్ ట్రిప్ అంటూ కితాబునిచ్చారు. ఆ టీషర్ట్‌పై ంఎ అని రాసుంది. ూష్టవ ఈబీబిబీతీవ తిబ ంఎ. ంఎవతీతిఇఃజీ-ఎనిటతిజీ” అని ప్రింట్ చేసుంది. దీన్ని తీసుకున్న ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లలో భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని అన్నారు బైడెన్. ఈ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు చేస్తూనే మోదీకి టీషర్ట్‌ని గిఫ్ట్‌గా ఇచ్చారు. దీనిపై ఆనందం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ ట్విటర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. “గత ఏడేళ్లలో భారత్ అమెరికా మధ్య మైత్రి బలపడింది. ద్వైపాక్షిక బంధాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. ఇక టెక్నాలజీ పరంగా చూస్తే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విస్తృతమవుతోంది. ఇదే సమయంలో మరో ంఎ కూడా బలపడుతోంది. అదే అమెరికా-ఇండియా

02

## దేశంలో కొత్త విద్యుత్ ఛార్జీలు

**న్యూఢిల్లీ :**



త్వరలోనే దేశంలో కొత్త విద్యుత్ ఛార్జీలు అమల్లోకి రాబోతున్నాయి. వీటి ప్రకారం పగటి పూట విద్యుత్ ఛార్జీలు 20 శాతం మేర తగ్గనుంచగా.. రాత్రిపూట 20 శాతం మేర విద్యుత్ ఛార్జీలు పెరగనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కొత్త విద్యుత్ నియమాలను కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. విద్యుత్ వినియోగాన్ని సమతౌల్యం చేయడానికి వాడుక సమయాన్ని పీక్ అవర్స్, టైమ్ ఆఫ్ దే గా విభజిస్తారు. టైమ్ ఆఫ్ దేలో వినియోగం తక్కువ ఉంటుంది కాబట్టి ఆ సమయంలో వాడే విద్యుత్తుకు తక్కువ రుసుం వసూలు చేయాలని కేంద్రం పేర్కొంది. ఎలాంటి వినియోగదారులకు ఎప్పటి నుంచి ఈ నిబంధనను వర్తింపజేయాలో ఇందులో పూర్తిగా వివరించింది. పది కిలో వాట్లకు

02

## ఈడీ కేసులపై టెన్షన్ ఎందుకు

**న్యూఢిల్లీ :**

.దేశవ్యాప్తంగా రాజకీయాలు రోజురోజుకీ ఇంట్రెస్టింగ్‌గా మారుతున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా బీజేపీని ఓడించాలన్న పట్టుదలతో ఉన్నాయి విపక్షాలు. ఇప్పటికే పట్నా వేదికగా వ్యూహాలూ సిద్ధం చేసుకున్నాయి. ఈ క్రమంలోనే జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఓ ట్వీట్ చేశారు. అఃఎ,ఇఆ పేరు చెప్పి బీజేపీ భయపెడుతోందని, అయినా ఎవరూ టెన్షన్ పడాల్సిన పని లేదని అన్నారు. నిజం కోసం పోరాటం చేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో బీజేపీ ఓటమి తప్పదు అంటూ జోస్యం చెప్పారు. అప్పుడు మోదీతో పాటు ఆయన అనుచరులనూ ఇన్వెస్టిగేట్ చేయిద్దామంటూ సెటైర్లు వేశారు. “నిజాన్ని నిర్భయంగా ఎదుర్కోండి. మరో ఆర్నెల్లలో ఎలాగో మోదీ ప్రభుత్వం పడిపోక తప్పదు. అప్పుడు ఆ అఃఎ, ఇఆ అధికారులకు అర్థమవుతుంది. వాళ్లంతట వాళ్లే వెళ్లిపోతారు. మీరేం చేయాల్సిన పని లేదు. బీజేపీ ఓడిపోయిన తరవాత ఆ పార్టీ నేతల్ని ఇన్వెస్టిగేట్ చేయిస్తే సరిపోతుంది. మోదీతో



పాటు ఆయన అనుచరులను, సన్నిహితులపైనా విచారణ జరివించాలి''గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు సత్యపాల్ మాలిక్. పుల్వామాలో భారత సైనికులపై దాడి చేసిన సమయంలో రాజ్‌నాథ్‌సింగ్‌ని తాను

02

## పిల్లలకు మంచి భవిష్యత్ కోసం తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ :**



తెలంగాణలో స్కూల్స్ పున: ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే పాఠశాలల్లో హాజరుశాతం పెరుగుతుంది. ఇప్పటికే విద్యార్థులకు వర్క్ బుక్స్, టెక్ట్ బుక్స్, యూనిఫామ్ దుస్తులు అందజేశారు. ఈ ఏడాది గవర్నమెంట్ స్కూల్ విద్యార్థుల యూనిఫామ్ కూడా మారిపోయింది. అంతేకాదు మరికొన్ని విప్లవాత్మక మార్పులు సైతం తీసుకువచ్చారు. రోజూ ఉదయం 5 నిమిషాలు యోగా లేదా ధ్యానం చేయాలి. ప్రతి వారం 3 నుంచి 5 పిరియడ్లు పిల్లలు ఆటలు ఆడుకునేందుకు కేటాయించాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. అంతేకాదు ‘నో

02

## టైటాన్ ఘటనపై కెనడా విచారణ

**న్యూఢిల్లీ :**



అట్లాంటిక్ మహా సముద్రంలో 13 వేల అడుగుల లోతులో ఉన్న టైటానిక్ నౌక శిథిలాలను చూసేందుకు ఐదుగురితో వెళ్లి గల్లంతైన టైటాన్ సబ్‌మెర్సిబుల్ కథ విషాదాంతమైన విషయం తెలిసిందే. తీవ్రమైన ఒత్తిడి వల్ల టైటాన్ పేలిపోయింది. దీంతో అందులో ఉన్న ఐదుగురు పర్యాటకులు మరణించారని అమెరికన్ కోస్ట్‌గార్డ్ ప్రకటించింది. రిమోట్ కంట్రోల్డ్ వెహికల్ సాయంతో మినీ జలాంతర్గామి శకలాలను గుర్తించామని తెలిపింది.ఈ ఘటనపై కెనడా విచారణ ప్రారంభించింది. సబ్ ఉపరితల నౌక

02

# నాసాతో కలిసి ఇస్రో....ఆర్టెమిస్

(మొదటిపేజీ తరువాయి)

సంయుక్త మిషన్ ను పంపేందుకు నాసా, ఇస్రో అంగీకరించాయని వైట్‌హౌస్ ప్రకటించింది. అందరి ప్రయోజనం కోసం అంతరిక్ష పరిశోధనల కోసం దేశాలను ఒకచోట చేర్చే ఆర్టెమిస్ ఒప్పందాలలో భారతదేశం చేరుతుందని అమెరికా అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన విజయవంతంగా సాగుతోందనడానికి ఇది మరో ఉదాహరణగా చెబుతున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితి లాన్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు మోదీ. అనంతరం వాషింగ్టన్ చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం వైట్ హౌస్ లో మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం పలు అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మోదీ పర్యటనలో భాగంగా భారత్ కు అమెరికా పలు వరాలు ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్ లో కొత్తగా అమెరికా కాన్సులేట్లు ఏర్పాటు కాబోతున్నాయి. బెంగళూరులో ఒక కాన్సులేట్ ఏర్పాటవుతుందని ప్రకటించారు. రెండో కాన్సులేట్ ఏర్పాటు చేసే ప్రాంతంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనితోతపాటు ఇప్పుడు నాసా, ఇస్రో సంయుక్త ఆపరేషన్ భారత్ కు మరింత ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ ఆర్టెమిస్ ఒప్పందాలపై రెండు దేశాలు సంతకం చేశాయి. చంద్రుడిపైకి, అంగారక గ్రహంపైకి కూడా మానవుల్ని పంపించేందుకు నాసా ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టింది. ఇటు భారత్ కూడా చంద్రయాన్ పేరుతో కొత్త ప్రయోగాలు చేస్తోంది. 2025 నాటికి చంద్రుడిపైకి మనుషుల్ని పంపించాలనేది నాసా ఆర్టెమిస్ మిషన్ ప్రధాన లక్ష్యం. ఈ ఆర్టెమిస్ మిషన్లో భారత్ ని భాగస్వామిని చేసేందుకు అమెరికా సవరణలు చేపట్టింది. అందులో భాగంగానే నాసా, ఇస్రో చేతులు కలిపాయి. ఆర్టెమిస్ ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఇకపై జాయింట్ ఆపరేషన్లకు సిద్ధమైనట్టు స్పష్టం చేశాయి. ఆర్టెమిస్ ఒప్పందంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో అడుగు ముందుకేసినట్టు స్పష్టమవుతోంది. నాసా సహకారంతో జాయింట్ మిషన్ కు ఇస్రో సిద్ధమవుతోంది. సాంకేతిక పరంగా ఇస్రోకి ఇది మరింత దన్నుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇస్రో అధికారులు త్వరలో ఈ జాయింట్ ఆపరేషన్ పై స్పందించే అవకాశం ఉంది. ఆర్టెమిస్ ఒప్పందం గురించి ఇస్రో అధికారులు మరిన్ని వివరాలు తెలియజేస్తారు.

# బ్యాంకులకు చేరిన 99 వేల కోట్ల 2 వేల నోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డర్లు పెట్టి, క్యాష్ ఆన్ డెలివరీని ఎంచుకునే కస్టమర్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. 2 వేల నోట్లను దేవాలయాలు ఒ ఇతర మత సంస్థలకు విరాళాలుగా ఇస్తున్నారు. బంగారం, వజ్రాభరణాలు, ంఅలు, ఖరీదైన మొబైల్ ఫోన్‌లు, లగ్జరీ ఫర్నీచర్ వంటి కన్స్యూమర్ డ్యూరబుల్స్ కోసం పింక్ నోట్లను పదేపదే ఉపయోగిస్తున్నారు. రేటెక్కువ అంటూ గతంలో నసిగిన వాళ్లు కూడా ఇప్పుడు సెకండ్ థాట్ లేకుండా సీరియస్‌గా కొంటున్నారు. ఇళ్లు, స్థలాల వంటి రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లో 2000 రూపాయల నోట్ల కట్టలు చేతులు మారుతున్నాయి. ఈ తరహా ఖర్చులు ఇంకా పెరుగుతాయని ఎస్‌బీఐ రిపోర్ట్ అంచనా వేసింది. స్టేట్ బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం... దాదాపు రూ.3.08 లక్షల కోట్లు డిపాజిట్ల రూపంలో బ్యాంకింగ్ వ్యవస్థలోకి వస్తాయి. అందులో రూ.92 వేల కోట్లు సేవింగ్స్ అకౌంట్లలో జమ అవుతాయి. ఈ డబ్బులో ఎక్కువ భాగాన్ని 2 వేల రూపాయల నోట్ల మార్పిడి కోసం జమ చేస్తారు తప్ప, అకౌంట్లలోనే ఉంచడానికి కాదు. కాబట్టి, అందులో 60 శాతం మొత్తాన్ని, అంటే దాదాపు రూ. 55,000 కోట్లను ప్రజలు వెనక్కు తీసుకునే అవకాశం ఉంది. వాటిని తిరిగి ఖర్చు పెట్టవచ్చని ఎస్‌బీఐ వెల్లడించింది. దీర్ఘకాలంలో ఇది రూ.1.83 లక్షల కోట్లకు చేరొచ్చని లెక్కగట్టింది. దీనివల్ల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుందని అంచనా వేసింది.

# దేశంలో కొత్త విద్యుత్ ఛార్జీలు

(మొదటిపేజీ తరువాయి)

మించి డిమాండ్ ఉన్న వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు 2024 ఏప్రిల్ ఒకటవ తేదీ లోపు టైమ్ ఆఫ్ డే టారిఫ్ అమలు చేయాలని స్పష్టం చేసింది. వ్యవసాయ దారులు మినహా ఇతర వినియోగదారుల అందరికీ ఈ నిబంధనను 2025 ఏప్రిల్ 1వ తేదీలోపు వర్తింపజేయాలని పేర్కొంది. ఏడాది తర్వాత వ్యవసాయ రంగం మినహా, మిగతా అన్ని రంగాల విద్యుత్ వినియోగదారులకు ఈ నియమాన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించింది. సౌర విద్యుత్ చౌకని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయ్యే పగటి సమయాల్లో విద్యుత్ ఛార్జీలు తక్కువగా ఉంటాయని తెలుస్తోంది. తద్వారా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. సౌర శక్తి అందుబాటులో లేని రాత్రి సమయాల్లో థర్మల్, హైడ్రో, గ్యాస్ ఆధారిత ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి కంటే వాటి ఖర్చులు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఈక్రమంలోనే రాత్రి వేళ విద్యుత్ ఛార్జీలను ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు. 2030 నాటికి శిలజాయేతర ఇధనాల శక్తి సామర్థ్యాన్ని 35 శాతం చేరేందుకు ఈ విధఆనం సహాయ పడుతుందని కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. అలాగే 2070 నాటికి సున్నా ఉద్గారాల లక్ష్యానికి అనుగుణంగా ఈ దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కాగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఈ విధానం వల్ల సోలార్ విద్యుత్ వ్యవస్థ ఉన్న వినియోగదారులకు మేలు జరగనుంది. అలాగే పగటి పూట వినియోగించే విద్యుత్ కు తక్కువ ఛార్జీలు, రాత్రి వేళ వినియోగించే లైట్లు, ఫ్యానులు, ఏసీలు వంటి వాటికి ఎక్కువ విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే దేశంలోని పలు రాష్ట్రాల్లో స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాయి. వినియోగదారులు విద్యుత్ వాడకం, తమ ఖాతాలో ఉన్న బ్యాలెన్స్ ను రోజువారీగా మొబైల్ ఫోన్లలో చెక్ చేసుకునే వీలును కల్పించేందుకు కేంద్ర విద్యుత్ శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విద్యుత్తు వినియోగదారుల హక్కులను సవరిస్తూ.. గురువారం కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం డిస్కంలు అన్ని రకాల స్మార్ట్ మీటర్లను ప్రతిరోజూ కనీసం ఒక్కసారైనా రిమోట్ విధానంలో పరిశీలించాలి. స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్ వినియోగదారులకు వారి విద్యుతు వాడకానికి సంబంధించిన సమాచారాన్ని వెబ్ సైట్ లేదా మొబైల్ యాప్ లేదా ఎస్ఎంఎస్ ల ద్వారా అందుబాటులో ఉంచాలి. ఎప్పటికప్పుడు వారు తాము వాడిన యూనిట్లు, దానికి అయిన ఖర్చు, మిగిలిన నగదు నిల్వను తనిఖీ చేసుకోవడానికి వీలు కల్పించాలని విద్యుత్తు శాఖ పేర్కొంది

# మోడీకి టీషర్ట్ గిఫ్ట్...

(మొదటిపేజీ తరువాయి)

బంధం"అమెరికాలో స్థిరపడిన భారతీయ సంతతిని ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ ప్రసంగించారు. అమెరికా పర్యటన సందర్భంగా వాషింగ్టన్ డీసీలోని రోనాల్డ్ రీగన్ సెంటర్లో ఈ కార్యక్రమం జరిగింది. తన మూడు రోజుల పర్యటనలో లభించిన ప్రేమాభిమానాలకు మీరే కారణం అంటూ కితాబు ఇచ్చారు. ఈ సందర్భంగా అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను మోదీ వివరించారు. భారత్ అమెరికా మధ్య స్నేహ బంధంలో కొత్త ప్రయాణం మొదలైందన్నారు. రోనాల్డ్ రీగన్ సెంటర్‌కు వచ్చిన భారతీయులంతా ఆ ప్రాంతాన్ని మినీ భారత్‌లా మార్చేశారని ఆనందం వ్యక్తం చేశారు మోదీ. అందమైన చిత్రాన్ని చూపించిన వారికి ధన్యావాదాలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కి కూడా ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశం-యుఎస్ భాగస్వామ్యాన్ని మరో ఎత్తుకు తీసుకెళ్లడంలో ఆయనదే కీలక పాత్ర అన్నారు. రక్షణ ఒప్పందాలు భారత్, అమెరికా సుస్థిరం చేశాయన్నారు. మోదీ. మేం ఒప్పందాలు, అగ్రిమెంట్స్ మాత్రమే చేసుకోవడం లేదు. జీవితాలను, కలలను, లక్ష్యాలను మార్చబోతున్నామని వివరించారు. మోడీకి పాదాబివందనంభారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికా పర్యటన ముగింపు కార్యక్రమంలో శనివారం అమెరికా గాయని మేరీ మిల్‌బెన్ ఇండియన్ జాతీయ గీతం 'జనగణమన'ను ఆలపించారు. అనంతరం మేరీ మిల్‌బెన్ మోదీకి పాదాభివందనం చేశారు. వాషింగ్టన్ డీసీలోని రోనాల్డ్ రీగన్ బిల్డింగ్ అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటరులో యునైటెడ్ స్టేట్స్ ఇండియన్ కమ్యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో తనదైన మోదీ అద్భుత ప్రసంగానికి అమెరికా కాంగ్రెస్ ఫిదా అయ్యింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆఫ్రికన్-అమెరికన్ హాలీవుడ్ నటి, గాయని మేరీ మిల్‌బెన్ (30) భారత జాతీయ గీతం జన గణ మన ఆలపించారు. అనంతరం ఓం జై జగదీశే హరే పాట కూడా పాడారు.జాతీయ గీతం, దేశభక్తి సంగీతాన్ని ఆలపించడానికి తనకు ఆహ్వానం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ కోసం భారత జాతీయ గీతాన్ని పాడటం గౌరవంగా భావిస్తున్నట్లు మేరీ వ్యాఖ్యానించారు. అమెరికన్, ఇండియన్ జాతీయ గీతాలు రెండూ ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ఆదర్శాలను తెలియజేస్తాయని, ఇది అమెరికా-భారత్ సంబంధాల సారాంశమని ఆమె అన్నారు. భారతీయ విలువలు, సంస్కృతి, ఆధ్యాత్మిక భావాలతో మోదీ ప్రపంచవ్యాప్తంగా ఎంతో గౌరవం పొందారని మేరీ వ్యాఖ్యానించారు. కాగా అమెరికా పర్యటన ముగియడంతో తదుపరి ఈజిప్టులో పర్యటనకు మోదీ పయనమయ్యారు.

# పిల్లలకు మంచి భవిష్యత్ కోసం తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

బ్యాగ్ డే' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెలలో నాలుగవ శనివారం నాడు విద్యార్థులు పుస్తకాల బ్యాగులు రాకుండానే పాఠశాలకు రావొచ్చు.ఈ లెక్కన ఏడాదిలో 10 రోజులు నో బ్యాగ్ డే ఉంటుంది. ఆ రోజున విద్యార్థుల ఆసక్తిని బట్టి.. 28 రకాల కార్యకలాపాలు చేయించవచ్చు. మ్యూజియంలు, చారిత్రక నేపథ్యం ఉన్న ప్రదేశాలు, గ్రామ పంచాయితీలు సందర్శించవచ్చు. మోడల్ ఎలక్షన్స్, మోడల్ అసెంబ్లీ, డూడ్లింగ్, సైన్స్ ప్రయోగాలు వంటి వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవచ్చు. ప్రైమరీ కేటగిరీ అంటే.. 1వ, 2వ తరగతి చదివే స్టూడెంట్స్.. ఫ్యామిలీ గురించి మాట్లాడాల్సి ఉంటుంది. కుంటుంబలోని ఒక వ్యక్తిలా యాక్ట్ చేయాల్సి ఉంటుంది. పిల్లల్లో భయం పోయి.. కమ్యూనికేషన్ స్కిల్స్, క్రియేటివిటీ పెరిగేలా ఫ్యామిలీలోని ఒక పర్సన్ స్కెచ్ గీయాల్సి ఉంటుంది.3 నుంచి 5వ క్లాసెస్ చదివే స్టూడెంట్స్.. వివిధ వృత్తుల్లో ఉపయోగించే పనిముట్లను డ్రాయింగ్ గీయాల్సి ఉంటుంది. వారికి నచ్చిన ప్రొఫెషన్ గురించి మాట్లాడాల్సి ఉంటుంది. ఇక 6 నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లలు.. ఫ్యామిలీ బడ్జెట్ గురించి విశ్లేషించాలి. రేషన్ షాపు, పోస్ట్ ఆఫీసు, పలు నిర్మాణ స్థలాలను ఫీల్డ్ విజిట్ చేయాల్సి ఉంటుంది. వీరికి ఇంకా చాలా ఇండోర్, అవుట్ డోర్ యాక్టివిటీస్ ఉంటాయి. ప్రైవమరీ లెవల్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో వీటిని తప్పనిసరి చేస్తున్నట్లు విద్యాశాఖ తెలిపింది.

# ఈడీ కేసులపై టెన్షన్ ఎందుకు

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించానని, జీప్‌లో కాకుండా వాళ్లను ఎయిర్‌క్రాఫ్ట్‌లో పంపాలని చెప్పాని అన్నారు. అప్పుడు తన మాట విని ఉంటే అంత మంది సైనికులు చనిపోయే వాళ్లు కాదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనమయ్యాయి. ఆ తరవాత వెంటనే సత్యపాల్ మాలిక్ కు సీబీఐ నోటీసులు ఇచ్చింది. రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కి చెందిన ఓ కేసులో సీబీఐ విచారణకు హాజరు కావాలని సత్యపాల్ మాలిక్‌కి నోటీసులు అందాయి. ఇలా కేంద్రంపై విమర్శలు చేశారో లేదో అలా సీబీఐ నోటీసులు వచ్చాయంటూ ప్రతిపక్షాలు ఈ అంశంపై తమ గళాన్ని బలంగా వినిపించాయి. బీజేపీ టైమ్ లోనే నాలుగు రాష్ట్రాలకు సత్యపాల్ మాలిక్ గవర్నర్ గా పనిచేశారు. 2017-18 బిహార్ గవర్నర్, 2018-19 అక్టోబర్ వరకూ జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ గా ఉన్నారు. 2019 ఫిబ్రవరి 14 పుల్వామా వద్ద ఉగ్రదాడి జరిగి 40మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ప్రభుత్వం సత్యపాల్ మాలిక్ ను గోవాకు గవర్నర్ గా నియమించింది. 2019-20 వరకూ గోవా గవర్నర్ గా, 2020 నుంచి 2022 అక్టోబర్ కు మేఘాలయకు గవర్నర్ గా ఉన్నారు సత్యపాల్ మాలిక్.

# భూగర్భ డ్రైనేజీ ఆధునీకరణకు 50 కోట్లు విడుదల చేయాలి

**హైదరాబాద్ :**

ఏ ముఖం పెట్టుకుని ఉప్పల్లో కేటీఆర్ అడుగుపెడతా దనుకుంటున్నారని ఉప్పల్ మాజీ ఎంఎల్ఏ ఎన్విఎస్-ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు.శనివారం మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న చెరువుల పరిస్థితి దుస్థితి చూడండి, మీ మిషన్ కాకతీయ ఏమైంది నల్లచెరువు ,రామంతపూర్ పెద్ద చెరువు, చిన్న చెరువు, హెచ్ఎంటి నగర్ , ఎర్రగుంట,కాప్రా, చర్లపల్లి చెరువుల, విస్తీర్ణం కబ్జా, మురుగునీరు, ఫెన్సింగ్ లేకపోవడం ,గుర్రపు డెక్క తో దోమలమయం ఇది మీ 10 సంవత్సరాల పురోగతి అని నిలదీశారు.ఉప్పల్ బస్సు టర్మినల్ నుఎందుకు అభివృద్ధి చేయటం లేదని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రారంభించిన శిల్పా రామమును మళ్లీ ప్రారంభించడమా! అని అన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులకు మీ శాఖ సహాయ నిరాకరణ పైపులైను, కరెంటు స్తంభం, లైట్ స్తంభం, మురికి కాలువ మార్చకుండా కాలయాపన చేస్తున్న జిహెచ్ఎంసి .రహదారి కొరకు భూములిస్తే నష్టపరిహారంలో వివక్ష చూపి, అక్రమ కట్టడాలని వేధిస్తారు, కూలుస్తారన్నారు.జిహెచ్ఎంసి ఎన్నికల సమయంలో ఉచిత నీరు అందిస్తామన్నారు మరి ఇప్పుడు నీటి బిల్లులు 800 ,1000 రూపాయలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. రామంతపూర్ ను దత్తత తీసుకుంటామన్నారు ప్రకటన చేసి ఆరు సంవత్సరాలు అయింది కనీస పనులు కూడా చేయలేదని, ఉప్పల్ నియోజకవర్గంలోని పలు కాలనీలు మురుగునీరుతో పొంగుతున్నాయి భూగర్భ డ్రైనేజీ ఆధునీకరణకు 50 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. జూనియర్ కాలేజ్ కావాలని ఎప్పటినుంచో పోరాటం తక్షణమే దీనిపై ప్రకటన చేయాలన్నారు.కూలుతున్న భవనాలు కాలుతున్న భవనాలు మ్యాన్ హోల్ మరణాలు మునుగుతున్న బస్తీలు మీ పాలనకు నిదర్శన మని విమర్శించారు. ఎం ఎస్ ఎం ఈ లను నీరుగార్చారు ,వాటికి విద్యుత్ సబ్సిడీ బకాయిలను, వర్కింగ్ క్యాపిటల్ రుణాలను ,ఇవ్వకుండా పరిశ్రమలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. దళిత బంధు కేటాయింపులో కమిషన్, లంచం ఇస్తేనే డబల్ బెడ్రూంలు పెన్షన్ ,రేషన్ కార్డు చివరకు కుల ధ్రువీకరణ ,ఆదాయ పత్రాలకు లంచం లంచం అని ఎద్దేవా చేసారు. కార్మికులకు భద్రత ,కనీస వేతనం కరువైందని,అశోక్ లేలాండ్ ,మోడరన్ బేకరీస్, పెంగ్విన్ టెక్స్టైల్స్ , టార్జన్ ప్రొడక్ట్స్ కంపెనీలు కొన్నది ఎవరని ప్రశ్నించారు. పాఠశాలల భవనాలపై కులవృత్తులు ,చేతివృత్తులు, ఇండ్లపై వాణిజ్య పన్ను ఏంది వీటికి సమాధానం చెప్పి ఉప్పల్లో అడుగు పెట్టాలి లేదా నీ పర్యటనని అడ్డుకుంటా మని ప్రభాకర్ హెచ్చరించారు.

# టైటాన్ ఘటనపై కెనడా విచారణ



(మొదటిపేజీ తరువాయి)

పోలార్ ప్రిన్స్ కెనడియన్ ఫ్లాగ్‌డ్ షిప్ అయినందున ఈ సంఘటనపై దర్యాప్తు ) చేపట్టినట్లు కెనడా ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ తెలిపింది.శతాబ్దం క్రితం అట్లాంటిక్ మహా సముద్రంలో మునిగిపోయిన టైటానిక్ నౌక శకలాలను చూసేందుకు.. ఓషన్ గేట్ ఎక్స్ పిడీషన్స్ అనే సంస్థ ఈ సాహసయాత్రను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ యాత్రకు ఆదివారం మినీ టైటాన్ బయలు దేరింది. ఈ మినీ జలాంతర్గామిలో 96 గంటలకు సరిపాడా ఆక్సిజన్ ఉంది. అయితే, సాగరగర్భంలోకి వెళ్లిన గంటా 45 నిమిషాల తర్వాత టైటాన్ తో సంబంధాలు తెగిపోయాయి. దీంతో దాని జాడ కోసం కెనడా, అమెరికా దళాలు సముద్రాన్ని నాలుగు రోజుల పాటు జల్లెడపట్టాయి. అయినా ఫలితం లేకపోయింది. సముద్రం లోపల తీవ్రమైన ఒత్తిడి వల్ల టైటాన్ పేలిపోయింది. అందులోని ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

# దళిత మహిళను ప్రేమించి మోసం చేసిన ప్రియుడు రాఘవేంద్ర

**ఎమ్మిగనూరు**

పట్టణానికి చెందిన దళిత మహిళ ఇందిరా అను అమ్మాయిని నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన చాకలి రాఘవేంద్ర గత రెండు సంవత్సరాలుగా ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి అమ్మాయిని లోబర్చుకుని తీరా పెళ్లి చేసుకోమంటే మా తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని తప్పించుకు తిరుగుతున్న ప్రియుడు రాఘవేంద్ర పై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే ఎమ్మిగనూరు పట్టణంలోని ఒక ప్రయివేటు హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తున్న బాధితురాలితో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్న రాఘవేంద్ర పరిచయం చేసుకుని ప్రేమిస్తున్నాని ఆమె వెంటపడి ప్రేమించేలా చేసుకున్నాడు. ప్రేమ పేరుతో షికార్లకు తిప్పి, మాయ మాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని శారీరకంగా లోబర్చుకున్నాడని ఆమె అన్నారు. పెళ్లి చేసుకుందామని రాఘవేంద్రను బాధితురాలు అడుగుతుంటే, ఇంట్లో ఆడపిల్ల పెళ్లి అయ్యాక చేసుకుందామని చెబుతూ వచ్చాడని ఆమె తెలిపారు. ఆడపిల్ల పెళ్లి అయిపోయాక పెళ్లి చేసుకుందామని బాధితురాలు రాఘవేంద్రను ఒత్తడి చేయగా మా తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని చెప్పి రాఘవేంద్ర ముఖం చాటేసి తిరుగుతున్నాడని ఆమె తెలిపారు. గత ఐదు నెలల నుండి కనిపించకుండా రాఘవేంద్ర తిరుగుతున్నాడని, అతనిపై ఎమ్మిగనూరు పట్టణ పోలీసు స్టేషన్ లో,స్పందనలో జిల్లా ఎా.ఖ కి బాధితురాలు ఫిర్యాదు చేసిన రాఘవేంద్రను పట్టుకురాలేదని అతనిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆమె అన్నారు. ఎమ్మిగనూరు పట్టణ పోలీస్ స్టేషన్ చుట్టూ గత ఐదు నెలలుగా తిరుగుతున్న పోలీసులు తనకు న్యాయం చేయలేదని, ప్రియుడు జాడను కనుగొనలేదని చేసేదిలేక బాధితురాలు న్యాయం కోసం ప్రియుడు రాఘవేంద్ర ఇంటి ముందు బైఠాయించినదని,తనకు న్యాయం జరిగే వరకు ఇంటి ముందు నుంచి కదిలే ప్రసక్తే లేదని బాధితురాలు అన్నట్లు ఆమె తెలిపారు.

# పశ్చిమ వైసీపీలో దూకుడు

**ఏలూరు :**

పశ్చిమగోదావరి జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ నెగ్గని రెండు నియోజకవర్గాల్లో ఉండి ఒకటి. ఇక్కడ వైసీపీలో మొదటి నుంచి వర్గపోరు తీవ్రంగానే ఉంది. పార్టీ బలోపేతానికి ఇంఛార్జ్ పదవులు చేపడుతున్న నేతలు.. కేడర్‌ను పట్టించుకోరనే విమర్శలు వినిపిస్తాయి. ఇప్పటికే నియోజకవర్గంలో మూడుసార్లు ఇంఛార్జులను మార్చారు. అయినప్పటికీ పరిస్థితి మొదటికొస్తుంది తప్పితే మార్పు లేదట. గత ఎన్నికల్లో ఓడిన పీవీఎల్ నరసింహారాజును ఆ మధ్య ఇంఛార్జ్ పదవి నుంచి తప్పించారు. తాజాగా మళ్లీ ఆయనకే పగ్గాలు ఇచ్చారు. దీంతో ఉండి వైసీపీలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదంటోంది కేడర్. ఉండి వైసీపీ ఇంఛార్జ్‌గా అప్పట్లో మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఉండేవారు. ఆయన 2014లో ఓడిపోవడంతో.. 2019లో సర్రాజును కాదని.. పీవీఎల్ నరసింహారాజును బరిలో దించింది పార్టీ. ఈ మార్పూ వర్కవుట్ కాలేదు. ఉండిలో పార్టీ నేతల మధ్య సమన్వయం లేదని భావించిన వైసీపీ పెద్దలు నరసింహారాజును తప్పించి.. గోకరాజు రామరాజును ఇంఛార్జ్‌గా నియమించారు. ఏమైందో ఏమో.. రామరాజును తప్పించి మళ్లీ నరసింహారాజును తెరపైకి తీసుకొచ్చింది పార్టీ. అసలే గ్రూపుల గోలతో ఇబ్బంది పడుతున్న తరుణంలో పీవీఎల్‌కు మళ్లీ ఎందుకు పగ్గాలు అప్పగించారన్నది కేడర్ ప్రశ్న. ఆయన గ్రూపులను ప్రోత్సహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడూ అదే జరుగుతుందని భయపడుతున్నారట. అసలు ఈ పంచాయితీ మనకెందుకు అని భావిస్తున్న కొందరు నేతలు తాజా పరిణామాలు రుచించక పార్టీ మారే ఆలోచనలో ఉన్నారట. వైసీపీ గ్రామ కమిటీలలో పార్టీ కోసం పని చేసిన వారికి కాకుండా.. తనకు అనుకూలంగా ఉన్నవారికే నరసింహారాజు చోటు కల్పించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కమిటీలపై వైసీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీలకు కూడా సమాచారం లేదట. ఉండిలో వైసీపీ బలోపేతం కోసం మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజుకు క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. పీవీఎల్ నరసింహారాజు డీసీసీబీ ఛైర్మన్‌ను చేశారు. నియోజకవర్గంలో గోకరాజు రామరాజు కుటుంబానికి పట్టు ఉంది. ఇంతచేసినా ఉండిలో వైసీపీకి తేడా కొట్టడానికి కారణం సమన్వయ లోపమే అన్నది కేడర్ చెప్పే మాట. పదవుల్లో ఉన్న నేతలు కేడర్‌ను చేరదీయకపోవడం.. కేడర్ విశ్వసించేలా పనులు చేపట్టకపోవడం పెద్దలోటుగా చెబుతున్నారు. ఇప్పుడు పాతరాజుగారే మళ్లీ ఇంఛార్జ్‌గా వచ్చారు. మరి.. గతంలోలా వర్గాలను ప్రోత్సహిస్తారో? లేక అందరినీ కలుపుకొని వెళ్తారో చూడాలి.

# నిర్వాసితుల కోసం మహాపాదయాత్ర

**ఏలూరు,:**

తరతరాలుగా ఆ భూమితో, ఆ ఊరితో తీరని అనుబంధం. వేకువజామున నిద్ర లేచినప్పటి నుంచి మళ్లీ సేద తీరే వరకు ఆ పల్లెతోనే జీవన ప్రయాణం. అలాంటి ఆ మాతృభూమిని రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసి.. పల్లె తల్లి ఒడిలో నుంచి కన్నీటితో బయటికి వచ్చారు. తాము ఇబ్బందులు పడినా.. రానున్న తరాలు బాగు పడతాయనే సదుద్దేశంతో ముందడుగు వేశారు. ఎన్నో కలలతో కట్టుకున్న సొంత ఇంటిని వదిలేసి నిర్వాసితులుగా మారారు. అండగా ఉంటామన్న ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలతో సరిపెడుతుంటే.. కష్టాన్ని దిగమింగి కాలంతో పోరాడుతున్నారు. ఇలా రోడ్డున పడిన పోలవరం నిర్వాహసితుల కోసం సీపీఎం పోరు కేక పెట్టింది. నిర్వాసితుల గోడు వినే వరకు కదం తొక్కుతామని ముందుడుగు వేసింది. యాత్ర అడుగులో అడుగేసిన నిర్వాసితుల కన్నీళ్లు ఎరుపెక్కాయి. తమ ఆవేదన ఆలకించాలని నినదించాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే ఆంధ్రప్రదేశ్ సస్యశ్యామలంగా ఉంటూ పంటలు సుభిక్షంగా పండుతాయని ఉద్దేశంతో వేల ఎకరాల భూములు, గ్రామాలు ఖాళీ చేసి కట్టుబట్టలతో బయటికి వెళ్లిన అభాగ్యులు కన్నెర్ర చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను గాలికి వదిలేసి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, సరైన పునరావాసం కల్పించకుండా కాలం గడుపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పే విధంగా పోరు కేకతో నిర్వాసితులు మహాపాదయాత్రకు కదం తొక్కారు. జాతీయ ప్రాజెక్టును పూర్తి చేసిన బాధ్యత మొదట తమదేనన్న కేంద్ర ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని నిలదీశారు. ప్రాజెక్టు నిర్మాణాలను అంగరంగ వైభవంగా చూపిస్తున్న ప్రభుత్వం.. నిర్వాసితుల వేదనలను ఎందుకు ప్రజలకు వివరించడం లేదని ప్రశ్నించారు. పునరావాసం పూర్తయ్యాకే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎంతో కలిసి పోరు కేక పెట్టారు.. కళ్లుండి చూడలేని, చెవులుండి వినలేని గుడ్డి, చెవిటి ప్రభుత్వాల్ని మనం ఎన్నుకున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు విమర్శించారు. వరదలొస్తే మురుమూరు గ్రామం నీటమునిగే ప్రమాదముందని, 41 కాంటూరులో కలపాలని కోరుతూ అధికారికి మెమోరాండం సమర్పించారు. మురుమూరులో మొత్తం 356 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. పాదయాత్రకు వైసీపీ కాచవరం నాయకులు సంఘీభావం పలికారు. అనంతరం పల్లూరు గ్రామంలో బహిరంగ సభ నిర్వహించారు. పోలవరం నిర్వాసితులకు పునరావసంతోపాటు పూర్తి పరిహారం చెల్లించాకే గ్రామాలను ఖాళీ చేయించాలని మహా పాదయాత్ర డిమాండ్ చేస్తోంది. పునరావాసం పూర్తయ్యే వరకు ముంపు గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలని, 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాలు రీ సర్వే చేయాలని, మండలాన్ని యూనిట్ గా తీసుకొని పునరావాసం పరిహారం అర్హులందరికీ ఇవ్వాలని కోరింది. పునరావాసం ఏకకాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలని, ప్రతి ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసింది. గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ పరిహారం ఇవ్వాలని, నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని కోరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక నుంచి నిర్వాసితుల మహాపాదయాత్ర ప్రారంభమైంది. పోలవరం నిర్వాసిత గ్రామాల్లో 400 కిలోమీటర్ల మేర 15 రోజులపాటు యాత్ర కొనసాగనుంది. జూలై నాలుగో తేదీన విజయవాడలో మహా ధర్నాతో ఈ పాదయాత్ర ముగుస్తుంది.

# సీఎన్జీ బస్సులతో పర్యావరణం

**విశాఖపట్టణం:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీఎన్‌జీ బస్సులు నడుపుతూ ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది విశాఖ వ్యాలీ స్కూల్. ఇటీవల పాఠశాల యాజమాన్యం కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ)తో నడిచే ఆరు బస్సులను కొనుగోలు చేసింది. పాఠశాల విద్యార్థుల కోసం ఈ బస్సులను నడుపుతోంది. కొన్నేళ్లుగా నడుస్తున్న బస్సులు మరమ్మతులకు గురి కావడంతో.. వాటి స్థానంలో డీజిల్‌తో నడిచేవి కాకుండా సీఎన్‌జీ బస్సులు కొనుగోలు చేసింది. డీజిల్‌తో నడిచే బస్సుల కారణంగా అధిక శాతం నల్లని పొగ బయటకు వస్తుంది. దీని వల్ల పర్యావరణానికి చాలా నష్టం. అదే సీఎన్‌జీ బస్సులతో నగరానికి కాలుష్య ముప్పు తక్కువ. అందులో భాగంగానే విశాఖ వ్యాలీ పాఠశాల యాజమాన్యం సీఎన్‌జీ బస్సులను కొనుగోలు చేసి.. ప్రైవేట్ పాఠశాలలకు ఆదర్శంగా నిలిచింది. సాధారణంగా డీజిల్‌తో నడిచే బస్సుల కంటే ఈ బస్సులు ఎక్కువ మైలేజీ ఇస్తాయని డ్రైవర్లు చెబుతున్నారు. డీజిల్ బస్సులు లీటర్‌కు 5 నుంచి 6 కిలోమీటర్లు నడుస్తాయి. అదే సీఎన్‌జీ బస్సులు ఓ కిలో గ్రాము గ్యాస్‌తో 7 నుంచి 8 కిలోమీటర్ల దూరం నడుస్తాయని చెబుతున్నారు. వీటి వల్ల కార్బన్ డయాక్సైడ్ చాలా తక్కువగా వెలువడుతుంది. వాతావరణం కాలుష్యం కాకుండా తమ వంతు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామని ఇక్కడ యాజమాన్యం చెబుతోంది. ఇటీవల కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ లక్ష్మీశ ఈ బస్సులను ప్రారంభించారు. ఈ బస్సులను పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు పరిశీలిస్తున్నాయి. ఎక్కువ మైలేజీతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఉపయుక్తంగా ఉండటంతో.. వీటిని నడిపేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఈ బస్సుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇద్దరు విద్యార్థులకు ఒక సీటు చొప్పున కేటాయించారు. ప్రతి బస్‌లో 40 మంది విద్యార్థులు ప్రయాణించవచ్చు. ఇందులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ సేఫ్టీ సిద్ధం చేశారు. బస్ వెనుక భాగం కిందన సీఎన్‌జీ సిలిండర్ల క్యాబిన్ ఉంటుంది.

# ప్రైమ్ ల్యాండ్స్ పేరిట కంపెనీ దగా..

**హైదరాబాద్ :**

టీమ్ వన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన ప్రైమ్ ల్యాండ్ అనే కంపెనీ రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం గూడూరులో రిజర్వ్ అనే ప్రాజెక్టు పేరుతో 30 ఎకరాల్లో లే అవుట్ వేసింది. రోడ్లు వేసి, ప్లాట్లు చేసింది. సైట్ డిజైన్, డిజైన్ విజన్, మాస్టర్ ప్లాన్, ఇంటీరియర్ విజువలైజేషన్, ఆర్కిటెక్చరల్ మూడ్ బోర్డు, ల్యాండ్ స్కేప్ విజువలైజేషన్, ఎక్స్ క్లూజివ్ ఫీచర్స్ అన్నీ రూపొందించారు. 5, 10, 20 గుంటల ప్లాట్లు చేశారు. ఇందులో రెండెకరాలు నేచర్ రిసార్ట్ నిర్మిస్తామని పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఆ రిసార్ట్ లో రూ.99 లక్షలకే ఫామ్ హౌజ్ అంటూ చెబుతున్నారు. క్లబ్ హౌజ్, రిసెప్షన్, వెయిటింగ్ ఏరియా, కాఫీ లాంజ్, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్, స్పా, స్టీమ్ రూమ్స్, జిమ్, మెడిటేషన్ సెంటర్లు, ఇండోర్, ఔట్ డోర్ స్పోర్ట్స్, మినీ థియేటర్, ఓపెన్ థియేటర్, కమ్యూనిటీ హాల్, లాంజ్ పార్టీ స్పేస్ వంటివి అనేకం చూపించారు. 30, 40 ఫీట్ల రోడ్డు కూడా ఏర్పాటు చేశారు. అన్నీ పేపర్ల మీద చూపిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే హెచ్ఎండీఏ అనుమతులు తీసుకోకుండా, కస్టమర్లకు గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తూ పట్టాదారు పాసు పుస్తకాలను ఇప్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో రెవెన్యూ నిర్ణయించిన మార్కెట్ ధర ఎకరానికి రూ.12,37,500గా ధరణి పోర్టల్ చూపిస్తున్నది. కానీ కంపెనీ వాళ్లు మాత్రం రూ.40 లక్షలకు అమ్మేస్తున్నట్లు చూపిస్తున్నారు. వాస్తవానికి కంపెనీ గజానికి రూ. 15వేలవరకు ధర పెట్టింది. అంటే ఎకరానికి కస్టమర్ నుంచి వసూలుచేస్తున్న రూ.7 కోట్లకు స్టాంప్ డ్యూటీ లెక్క కట్టాలి. కానీ ఎటూ కాకుండా రూ.40 లక్షల వరకు మాత్రమే లెక్కిస్తున్నది. ఏ ప్రాతిపదికన స్టాంప్ డ్యూటీ కడుతున్నారో అర్థం కావడం లేదు. హెచ్ఎండీఏ, డీటీసీపీ లే అవుట్ వేస్తే ఏ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తారో, అంత కంటే ఎక్కువే ఇస్తామంటూ బ్రోచర్లలో ప్రచారం చేస్తున్నారు. అలాగే గజం ధర రూ.15 వేలకు పైగా పెట్టారు. మరి ఇంత ధర వెచ్చించినప్పుడు అనుమతుల కోసం ఎందుకు ప్రయత్నించలేదో అర్థం కావడం లేదు. దాని పక్కనే డీటీసీపీ అప్రూవ్డ్ లే అవుట్లు ఉండడం గమనార్హం. ఈ కంపెనీ గూడూరులో సర్వే నం.193, 198, 199, 200, 201 ల్లోని 30 ఎకరాల్లో వెంచర్ వేసింది. కానీ వెంచర్ కాదంటూ సేల్ డీడ్స్ ధరణి పోర్టల్ ద్వారా నడిపిస్తున్నది. దీనికి రెవెన్యూ అధికారులు ఫుల్ సపోర్ట్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఎక్కడైనా ప్లాట్, వ్యవసాయ స్థలం కొనుగోలు చేస్తే కనీసం ఒకటీ, రెండు వైపులా రోడ్డు ఉంటుంది. ఈ వెంచర్ లో ప్లాట్ కొనుగోలు చేస్తే ఆకాశం నుంచే వెళ్లాలి. ఎందుకంటే నలుదిక్కులా రోడ్డు అనేది డాక్యుమెంట్ లో ఉండదు. లే అవుట్ లో మాత్రం కనిపిస్తుంటుంది. సేల్ డీడ్ లో మాత్రం నలుదిక్కులా ఇతరుల భూమి అని పేర్కొంటున్నారు. ఏ ఒక్కరికి కూడా సేల్ డీడ్ లో దారి చూపించలేదు. లే అవుట్ లో ప్లాట్ల నంబర్లు ఉన్నాయి. కానీ దాని ప్రకారం రోడ్లు, సరిహద్దులు డాక్యుమెంట్లలో పేర్కొనలేదు. నలుదిక్కులా ఇతరుల భూమియే ఉన్నట్లు చూపించారు. భవిష్యత్తులో ఎక్కడి నుంచి వాళ్లు ప్లాట్లకు చేరుకోవాలో కంపెనీ చెప్పడం లేదు. పైగా అవసరాలకు అమ్మాల్సి వస్తే దారితెన్నులు లేని సేల్ డీడ్ ద్వారా స్థలాన్ని ఎవరు కొనుగోలు చేయడానికి ముందుగా రారు. దాంతో తిరిగి కంపెనీకే అప్పగించాల్సి వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే ప్రైమ్ ల్యాండ్స్ పేరిట కంపెనీ పేరు కనిపిస్తున్నది. సేల్ డీడ్స్ మాత్రం ఎలిగాంట్ ఆగ్రో ఫామ్స్ ద్వారా చేయిస్తుండడం గమనార్హం.

363 గజాల్లో 550 చ.అ.ల ఫామ్ హౌజ్ కి రూ.56.90 లక్షలు, అంటే మూడు గుంటల స్థలమన్న మాట. గజం ధర రూ.15 వేలు. దీన్ని బట్టి ఏ స్థాయి ధరలు పెట్టారో లెక్కలు వేసుకోవచ్చు. అంటే ఎకరం ధర రూ.7 కోట్ల వరకు నడిపిస్తుండడం గమనార్హం. దీంట్లో మూడు గుంటలు, ఐదు గుంటలు, 10 గంటలు, 20 గుంటల్లో ఫామ్ ప్లాట్లు చేశారు. ఎలిగాంట్ ఆగ్రో ఫామ్స్ నుంచి కొత్తూరుకు చెందిన ఒకాయనకు సర్వే నం.201అ1లో ఎకరం కొనుగోలు చేశారు. దీనికి గాను రూ.40 లక్షలుగా లెక్క చూపించారు.

మరొకరు సర్వే నం.193ఆ లో 25 గుంటలు కొనుగోలు చేస్తే రూ.18,75,000లుగా చూపించారు.

ఇంకొకరు సర్వే నం.200/ఆ లో 22 గుంటలు కొనుగోలు చేస్తే రూ.11 లక్షలుగా రిజిస్ట్రేషన్ విలువ చూపించారు.

ఆర్చ్, రెస్టారెంట్, డైనింగ్ ఏరియా, గెస్ట్ రూమ్స్, ఇండోర్ ప్లే ఏరియా, బంక్విట్ హాల్ వంటివి అనేకం నిర్మిస్తామని కంపెనీ ప్రచారం చేస్తున్నది. కానీ వాటికి మాత్రం అనుమతులు లేవు. మూడు బంక్విట్ హాళ్లు నిర్మిస్తామన్నారు. అందులో 1800 సిట్టింగ్ కెపాసిటీ ఉంటుంది. 16 ప్రైవేటు కాటేజీలు కూడా ఉంటాయి. వరల్డ్ క్లాస్ ఫీచర్స్ తో 40 వేల చ.అ.ల విస్తీర్ణంలో క్లబ్ రీసార్ట్ నిర్మిస్తామంటున్నారు. బడా కంపెనీ కూడా అనుమతులు తీసుకోకుండానే ప్లాట్లను ఫామ్ ప్లాట్లుగా అమ్మాల్సిన అవసరం ఏమొచ్చిందనే చర్చ నడుస్తున్నది. అటు రెవెన్యూ, ఇటు హెచ్ఎండీఏ, డీటీసీపీ, రెరా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిస్తున్నాయి.

# అడ్డూ, అదుపు లేకేండా అక్రమ నిర్మాణాలు

**విశాఖపట్టణం :**

విశాఖలో అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని జీవీఎంసీ కమిషనర్ చెబుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ కింద స్థాయి అధికారులు పెడ చెవిన పెడుతున్నారు. జోన్ 5లో డోర్ 44 - 15 - 99 లో స్టిల్ టు జి ప్లస్ టు అనుమతులు తీసుకొని అంతకు మించి అంతస్తులు అక్రమంగా నిర్మిస్తున్నారు. బీఏ నెంబర్ 1086/5894/ః/జి5/ఇఓ /2022లో 100 గజాల్లో భవనాన్ని నిర్మిస్తున్నట్టు ప్లాన్‌లో చూపించారు. అయితే 170 గజాల స్థలంలో భవన నిర్మాణాన్ని నిర్మిస్తున్నారు. ఆ భవనానికి దక్షిణ భాగంలో ఉన్న గెడ్డను సైతం పది అడుగులు ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారు. అయితే సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్లకు గంతలు కట్టుకొని వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అనుమతులు తీసుకున్న సమయంలో పునాదులు తీసేటప్పుడు ప్లానింగ్ అధికారులు పోస్ట్ వెరిఫికేషన్ చేసి, 30 అడుగుల రోడ్డు, మినిమం ఒక మీటరు సెట్ బ్యాక్ ఉన్నాయో లేదో పరిశీలించి నిర్మాణానికి ఓకే చెప్పాల్సి ఉంది. భవన యజమాని, ప్లానింగ్ అధికారులకు భారీ మొత్తంలో మామూళ్లు ముట్టచెప్పడంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రెటరీ కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై కమిషనర్ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రౌడీ షీటర్ హత్యకేసులో ముగ్గురు అరెస్టు

**అనకాపల్లి**

రౌడీ షీటర్ రాజాన కన్నబాబు హత్య కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసారు. హత్య కేసులో అనకాపల్లి ప్రాంతానికి చెందిన చిన్ని లక్ష్మణరావు అలియాస్ లచ్చ, పందిరి దుర్గారావు, లోపింటి సురేంద్ర లు అరెస్ట్ చేసారు. చోడవరంలోని ఒక భూమి విషయమై లక్ష రూపాయల కోసం రౌడీ షీటర్ లు రాజాన కన్నబాబు, చిన్ని లక్ష్మణరావు మధ్య వివాదం నెలకొందని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ వెల్లడించారు. ఈ వివాదం ముదరడంతో రౌడీ షీటర్ చిన్ని లక్ష్మణరావు తన అనుచరులైన పందిరి దుర్గారావు, లోపింటి సురేంద్ర తో కలిసి రౌడీ షీటర్ కన్నబాబును హతమార్చినట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితులు కత్తి ,కర్ర ఉపయోగించి కన్నబాబు పై దాడిచేసారు. రౌడీ షీటర్ హత్య నేపథ్యంలో జిల్లాలో ఉన్న రౌడీషీటర్ల కార్యకలాపాలపై నిఘా పెంచాం. రౌడీ షీటర్లు నేర ప్రవృత్తి మార్చుకోకపోతే పీడీ యాక్ట్ లు నమోదు చేస్తాం జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఒక రోజులో హత్య కేసులో నిందితులను పట్టుకోవడంతో రూరల్ పోలీసులను అయన అభినందించారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, కర్ర ,కత్తి స్వాధీనం చేసుకున్నారు.

# విస్తరించిన రుతుపవనాలు

**హైదరాబాద్ :**



నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలోని మరి కొన్ని భాగాలకు (నిజామాబాద్ వరకు) విస్తరించాయని హైదరాబాద్ లోని వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం (జూన్ 23) ఓ ప్రకటనలో తెలిపారు. రాగల 1-2 రోజుల్లో తెలంగాణలో అంతటా నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని చెప్పారు. ఈ రోజు ఆవర్తనం వాయువ్య బంగాళాఖాతం, పరిసరాలలోని ఒడిశా - పశ్చిమ బెంగాల్ తీరాలకు దగ్గరలో సగటు సముద్ర మట్టం నుండి 7.6 కిలో మీటర్ల వరకు కొనసాగుతూ ఎత్తుకి వెళ్లే కొద్దీ నైరుతి దిశగా కొనసాగుతుందని వివరించారు. ఈ వాతావరణ పరిస్థితుల వల్ల రాగల 3 రోజులకు తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు ఈ రోజు చాలా చోట్ల, రేపు, ఎల్లుండి అనేక చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ వచ్చే అవకాశం ఉంది. ఈ రోజు భారీ వర్షాలు రాష్ట్రంలో అక్కడక్కడ వచ్చే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి భారీ నుండి అతి భారీ వర్షాలు అక్కడక్కడ వచ్చే అవకాశం ఉంది. ఈ రోజు ఉత్తర తెలంగాణ జిల్లాలు, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు ఎల్లుండి భారీ నుండి అతి భారీ వర్షాలు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వచ్చే అవకాశం ఉంది. "ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సాయంత్రం లేదా రాత్రి సమయంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 39 డిగ్రీలు, 27 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు పశ్చిమ దిశ నుంచి గాలి వేగం గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది" అని వెదర్ బులెటిన్ లో పేర్కొ?న్నారు. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 68 శాతంగా నమోదైంది. నైరుతి రుతు పవనాలు ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించినట్లు అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాకు ఆనుకుని బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం.. రుతుపవనాలు వేగంగా విస్తరించడానికి సాయపడినట్లుగా అధికారులు అంచనా వేశారు. అటు ఉపరితల ఆవర్తనం, ఇటు రుతుపవనాల ప్రభావంతో నేడు, రేపు ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారులు అంచనా వేశారు. పశ్చిమగోదావరి, కోనసీమ, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు, కృష్ణా, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అల్లూరి, తూర్పుగోదావరి, మన్యం, అనకాపల్లి, బాపట్ల జిల్లాల్లో నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. విజయనగరం, చిత్తూరు, శ్రీకాకుళం, కాకినాడ, ప్రకాశం, అన్నమయ్య, కడప, విశాఖపట్నం, శ్రీసత్యసాయి, నెల్లూరు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేశారు.

## చౌదరి హిస్టరీ చాలా ఉంది

**హైదరాబాద్**

డ్రగ్స్ కేసులో పోలీసులకు దొరికిపోయిన తెలుగు నిర్మాత క్రిష్ణ ప్రసాద్ చౌదరిని విచారణ చేస్తుండగా పోలీసులకు సంచలన విషయాలు తెలిశాయి. ఆయన కస్టడీ రిపోర్టులో పోలీసులు కీలక వివరాలను వెల్లడించారు. కేపీ చౌదరి బయట పెట్టిన కొందరు సెలబ్రిటీల పేర్లను కూడా రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఈయన ప్రముఖులతో పాటు, సెలబ్రిటీలకు కొకైన్ అమ్మినట్లుగా పోలీసులు గుర్తించారు. బిగ్ బాస్ బ్యూటీ అషురెడ్డితో పాటు, బెజవాడ భరత్, తేజ, రఘుతేజ, సనా మిశ్రా, సుశాంత్ రెడ్డి, నితినేశ్, ఠాగోర్ ప్రసాద్, శ్వేత సహా పలువురి పేర్ల కేపీ చౌదరి లిస్టులో ఉన్నాయని పోలీసులు గుర్తించారు. అషురెడ్డి, జ్యోతి, సురేఖా వాణితో వందల కాల్స్ మాట్లాడినట్లుగా గుర్తించారు. వీరితో కేపీ చౌదరి దిగిన ఫోటోలు కూడా బయటికి వచ్చాయి. స్నేహిత హిల్స్ లోని సిక్కీ రెడ్డి ఇంట్లో తరచూ పార్టీలు నిర్వహించేవాడని తెలుస్తోంది.

## తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

**గుంటూరు**

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మునిపల్లె గ్రామ శివారు పెట్రోలు బంకు దగ్గర జిబిసి రోడ్డుపై శనివారం తెల్లవారుజామున శ్రీకృష్ణ ట్రావెల్స్ కు చెందిన బస్సు ఎదురుగా వస్తున్న బైకిస్టును తప్పించబోయి బస్సు రోడ్డు మార్జిన్ లో ఉన్న డివైడర్ ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా యూటర్న్ తీసుకుంది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. బస్సు ఒక్క కుదుపులో డివైడర్ ను ఢీకొని యూటర్న్ తీసుకోవడంతో ప్రయాణికులు ఒక్కసారి భయాందోళన చెంది కేకల వేశారు. క్షణాల్లో ఏం జరిగింది అని బస్సులో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. తెల్లవారుజాము కావడం వర్షం పడటంతో రోడ్డుపై రద్దీ లేకపోవడంతో పెను ఘోర ప్రమాదం తప్పింది.

## ఓజిలిలో లోకేష్ కు ఘనస్వాగతం

**సూళ్లూరుపేట**

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ఉమ్మడి నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చేరుకుంది. ఓజిలి మండలంలోని ఇనుగుంట ప్రాంతంలో టీడీపీ శ్రేణులు, నెలవల సుబ్రమణ్యం, మండలాధ్యక్షుడు విజయకుమార్ నాయుడు ఘనస్వాగతం పలికారు. వేదపండితులు, ముస్లిం, క్రైస్తవ పెద్దలు ప్రార్థనలతో నారాలోకేష్ ను ఆశీర్వదించారు. తమ నియోజవర్గానికి వచ్చిన లోకేష్ కి టీడీపీ ఉపాధ్యక్షుడు పరసా వెంకటరత్నం, మాజీ ఎఏంసీ ఛైర్మన్ శిరసంబేటి విజయబాస్కర్ రెడ్డి, వేనాటి సతీష్ రెడ్డి, కామిరెడ్డి ఆశోక్ రెడ్డి, కందల కృష్ణారెడ్డిలు శాలువాతో సత్కరించారు. తెలుగు మహిళలు కర్పూర హారతులతో ఆహ్వానించారు.

## కొప్పోలులో క్షుద్రపూజల కలకలం

**ఒంగోలు**

ప్రకాశం జిల్లా ఒంగోలు లోని కొప్పోలు ఫ్లై ఓవర్ పై అర్ధరాత్రి క్షుద్రపూజల కలకలం రేగింది. నడిరోడ్డుపై కోడిని కోసి గుర్తు తెలియని వ్యక్తులు పూజలు నిర్వహించారు. రోడ్డుపై ముగ్గులు వేసి పూజలు చేశారు. రోడ్డుపై పూజలు చేసి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు తరచూ ఇదే ఫ్లై ఓవర్ పై క్షుద్రపూజల ఆనవాళ్లు కనిపిస్తున్నాయంటున్నారు. ఫ్లై ఓవర్ పై సీసీ కెమెరాలు లేకపోవటంతో తరచూ ఇదే తరహా పూజలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై అర్ధరాత్రి సమయంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకావటంతో అటు వైపు రాత్రి వెళ్ళాలంటే భయాందోళనకు గురవుతున్నారు..

## హోం మంత్రి రాజీనామా చేయాలి

**హైదరాబాద్**

15 గంటలో 7 మర్డర్ కేసులు హైదరాబాద్ లో నమోదయ్యాయి. ఇంత క్రైం రాష్ట్రంలో జరుగుతుంటే హోంమంత్రి ఎం చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ ప్రశ్నించారు. దేశంలో నుంబర్ వన్ ఫ్రెండ్లీ పోలీసని అని చెపుతున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఫెయిల్ అయింది. సీసీ కెమెరాలు క్రైం ని అరికట్టడానికి వాడటం లేదు. ట్రాఫిక్ చలానాలు కోసం వాడుతున్నారని అయన ఆరో?పించారు. హైదరాబాద్ లో ఓపెన్ గా మర్డర్లు చేస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న క్రైమ్ కి నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా చేయాలి. మర్డర్ , అత్యాచార కేసులో వెంటనే చర్యలు తీసుకోవాలి. లా అండ్ ఆర్డర్ వదిలెసి హ్హమంత్రి కెసిఆర్ డ్యూటీ చేస్తున్నారని అయన అన్నారు.

## వంద కుంటుంబాలు వైసీపీ నుండి టిడిపిలో చేరిక

**శ్రీకాకుళం:**

కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 5వ వార్డు తాళబద్ర గ్రామంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలాస టిడిపి కార్యాలయం నుంచి వందలాది ద్విచక్ర వాహనాలపై తెలుగు తమ్ముళ్లు ర్యాలీగా కేటీ రోడ్ మీదుగా తాళభద్ర చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, కూన రవికుమార్, గౌతు శిరీష ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించకుండా అడ్డుకునేందుకు స్థానిక మంత్రి అప్పలరాజు పోలీస్ వ్యవస్థని వినియోగించుకొని ప్రయత్నం చేసినప్పటికీ.. స్థానిక మహిళా నేత గౌతు శిరీష న్యాయబద్ధంగా పోరాడి పోలీసుల నుంచి అనుమతి తీసుకొని భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హీటెక్కిన కాపు రాజకీయం

**విజయవాడ :**

ఏపీలో కాపు రాజకీయం హీటెక్కింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలో కాపు నేతలపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. దీంతో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం చాలా రోజులు తర్వాత రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. ప్రశాంతంగా కనిపించే కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంలో ఆవేశం కట్టలు తెగింది.. నిరసనలు తప్ప విమర్శలకు సైతం దూరంగా ఉండే పెద్దాయన ఒక్కసారిగా సవాళ్లు విసిరారు. రాజకీయాలు వదిలేసిన ఆయన మళ్లీ పోటీకి సై అంటున్నారు. ఎక్కడ చెడిందో కానీ.. ఈ ఇద్దరి మధ్య యుద్ధం ఏపీ రాజకీయాలను కుదిపేస్తోంది. ఇందులో పార్టీలు, వ్యక్తులు, సినిమా ప్రముఖులు సైతం ఎంట్రీ ఇవ్వడం సంచలనంగా మారింది. ఏపీలో కాపు రాజకీయం కొత్త మలుపు తిరుగుతోంది. కాపు వర్సస్ కాపు యుద్ధం మొదలైంది. కాపు ఉద్యమ నాయకుడు ముదగ్రడ తనదైన లేఖలతో జనసేనను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. పిఠాపురం నుంచి తనపై పోటీకి సిద్ధపడాలని పవన్ కళ్యాణ్‌కు సవాల్ చేశారు ముద్రగడ. కాకినాడ ఎమ్మెల్యేతో కలిపి తనను ఎందుకు తిట్టారని ప్రశ్నించారు. శక్తి..పౌరుషం మీకు ఉన్నాయని భావిస్తున్నానంటూ తీవ్రంగా లేఖ రాశారు ముద్రగడ. కాపుల గురించి మాట్లాడే అర్హత ఉందా అని పవన్ ను ముద్రగడ ప్రశ్నించడం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వంగవీటి రంగా హత్య నుంచి నిన్నటి ద్వారంపూడి ఇష్యూ వరకూ అన్ని అంశాలను లేఖలో ప్రస్తావించిన ముద్రగడ లేఖ ఇప్పుడు కలకలం రేపుతోంది. మరోవైపు పవన్ కల్యాణ్ పై తీవ్ర ఆరోపణలు చేశారు పోసాని కృష్ణమురళి. కాపుల్లో గొప్ప నాయకుడిగా ఉన్న ముద్రగడను తిడుతూ చంద్రబాబును పవన్ కల్యాణ్ పొగడటం వింతగా ఉందన్నారు పోసాని. కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని.. ఇందులో భాగంగానే ముద్రగడపై పవన్‌ను విమర్శలు చేస్తున్నారన్నారు సజ్జల. ముద్రగడ వెనుక వైసీపీ ఉందనేది అవాస్తవమన్న సజ్జల.. ముద్రగడ కాపులకోసం పనిచేసే వ్యక్తి అన్నారు. ముద్రగడ లేఖ వెనక వైసీపీ ఉందంటోంది జనసేన. ఏవరో రాసిస్తే సంతకాలు చేస్తున్నారని ఆరోపించారు ఈ పార్టీ నాయకులు. మొత్తానికి గోదావరి తీరంలో కాపు రాజకీయం రసవత్తరంగా నడుస్తోంది. పవన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీంతో పవన్ అభిమానులు ముద్రగడను టార్గెట్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయనపై ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇందుకు ముద్రగడ కూడా అంతే స్థాయిలో కౌంటర్ ఇస్తున్నారు. ఇక పవన్ కల్యాణ్‌పై తాను పోటీ చేస్తానని ముద్రగడ సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో ముద్రగడ పద్మనాభంపై కాపు సీనియర్ నాయకుడు హరిరామజోగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధికోసమే ముద్రగడ పద్మనాభం కాపు ఉద్యమం చేపట్టారన్నారు. కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ చేసింది సున్నానేనని విమర్శించారు. ముద్రగడకు పవన్ విమర్శించే స్థాయి లేదని హరి రామ జోగయ్య వ్యాఖ్యానించారు. కాపుల కోసం పవన్ కల్యాణ్ పార్టీ పెట్టలేదని చెప్పారు. ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకే పవన్ రాజకీయాల్లోకి వచ్చారని హరిరామ జోగయ్య పేర్కొన్నారు.

# ఐ ప్యాక్ లో ముగ్గురు మాజీ మంత్రులు

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలోనే ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో నివేదికలు చెప్పించుకుంటూ అభ్యర్థుల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష నిర్వహించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇందులో 15 మంది ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేదని తేలినట్టు పేర్కొన్నారు. పనితీరు సరిగ్గా లేని వారికి వ్యక్తిగతంగా రిపోర్టులు పంపి, వారితో మాట్లాడతానని, అప్పటికి వారి పనితీరు మారకపోతే టికెట్లు ఇవ్వలేనని సీఎం జగన్ స్పష్టం చేశారు. అయితే వైయస్ జగన్మోహన్ రెడ్డి పనితీరు బాగోలేదు అని చెప్పిన ఎమ్మెల్యేలలో మాజీ మంత్రులు కూడా ఉన్నారని సమాచారం. ఎమ్మెల్యేలతో నిర్వహించిన వర్క్ షాప్ లో కొంతమందికి టికెట్లు అనుమానమేనని ముందుగానే తేల్చేశారు సీఎం జగన్మోహన్ రెడ్డి అయితే ఆ పదిహేను మందిలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, కొడాలి నాని, పేర్ని నాని పేర్లు ఉన్నట్టుగా ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఏపీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి కోసం ప్రతిపక్ష టీడీపీని, జనసేనను, బీజేపీని తూర్పారబట్టే ముగ్గురు మాజీ మంత్రుల పేర్లు ఈ లిస్టులో ఉండటం నిజంగా వారికి షాక్ అనే చెప్పాలి.. ప్రతిపక్ష పార్టీలపై చీటికిమాటికి విరుచుకు పడే ఈ ముగ్గురు మాజీ మంత్రులు సీఎం జగన్ మోహన్ రెడ్డి టికెట్ ఇవ్వకపోతే ఏ పార్టీలోకి వెళ్ళలేని పరిస్థితి. టికెట్ ఇవ్వకుంటే, మంత్రులుగా పనిచేసిన వీరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో ఇమడలేని పరిస్థితి. దీంతో తాజా పరిణామాలతో వీరికి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టుగా ఉందని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతుంది. ప్రజా క్షేత్రంలో పని చేసి ప్రజల మద్దతు పొందితే ఆలోచిస్తానని సీఎం జగన్ చెప్తున్నా వీరికి ప్రజా మద్దతు దొరుకుతుందా? అనేది కూడా పెద్ద ప్రశ్నే. ఏది ఏమైనా జగన్మోహన్ రెడ్డి కోసం ఏమైనా చేస్తామని చెప్పే వీరు, సీఎం జగన్మోహన్ రెడ్డి ఒకవేళ టికెట్ ఇవ్వకపోతే ఏం చేస్తారు? సైలెంట్ గా ఉంటారా లేక పక్క చూపులు చూస్తారా? అన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# మిర్చి...మూడు నెలల్లో రూ.4,500 పెరుగుదల

**గుంటూరు :**

ఎండు మిర్చి ధర రోజు రోజుకూ పెరుగుతోంది. మార్కెటింగ్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల నేపథ్యంలో దళారుల ప్రమేయం తగ్గి, వాస్తవ ధరలు రైతులకు అందుతున్నాయి. చీడపీడల కారణంగా ఏడాది పంట దిగుబడులు తగ్గినా.. ధరలు పెరుగుతుండటం రైతన్నలకు ఊరటనిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా 341 మిర్చి రకం ధర ఏకంగా క్వింటాల్ రూ.26 వేలకు చేరింది. దీంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన ఎండు మిర్చిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎగబడుతున్నారు. మిర్చి పైరుకు గత ఏడాది తెగుళ్లు సోకడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఇదే సందర్భంలో ఎగుమతులు పెరిగాయి. బంగ్లాదేశ్ వంటి దేశాలకు సైతం ఎగుమతి కావడం, దేశీయంగా డిమాండ్ పెరగడంతో ధరలు ఎగబాకుతున్నాయి. దీంతోపాటు నాణ్యమైన సరుకు లభ్యత తక్కువ ఉండటం ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. విదేశాలకు ఎగుమతి అయ్యే తేజ, బాడిగ రకాల మిర్చికి గతంలో అధిక ధర ఉండేది. అందుకు భిన్నంగా ప్రస్తుతం 341 రకం మిర్చికి డిమాండ్ పెరిగింది. ఫలితంగా ఈ రకం మిర్చి ధర కనీవినీ ఎరుగని రీతిలో ఎగబాకుతోంది. మార్చి నెలలో 341 మిర్చి క్వింటాల్ రూ. 21,500 ధర పలికి రికార్డు సృష్టించింది. ఈ ధర క్రమంగా పెరుగుతూ.. ప్రస్తుతం రూ.26 వేలకు చేరింది. రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గుంటూరు, నడికుడి, ఖమ్మం, వరంగల్ మార్కెట్లలో నాణ్యత గల అన్ని రకాల మిర్చి ధరలు పెరుగుతున్నాయి. క్వింటాల్‌కు సగటున రూ.20 వేలకు పైగా పలుకుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చిని సైతం కొనేందుకు వ్యాపారులు ఎగబడటంతో సందడి నెలకొంది. గుంటూరు, ప్రకాశం, కృష్ణా, కర్నూలు, తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో 341 రకం మిర్చిని సాగు చేస్తారు. చిక్కటి ఎర్ర రంగు కలిగి ఉండే ఈ రకాన్ని కారం తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దేశీయంగా పచ్చళ్ల తయారీతోపాటు, గృహావసరాలకు వాడుకోవడానికి ఎక్కువగా ఇష్టపడతారు. ఉత్తర భారతదేశంలో ఈ రకానికి మంచి డిమాండ్ ఉంది. కొత్త పంట నవంబర్ వరకు వచ్చే అవకాశం లేకపోవడంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి

# జీడి రైతులను దోచుకుంటున్న యాజమాన్యాలు

**శ్రీకాకుళం**

జీడి యాజమాన్యం జీడి పరిశ్రమలు బంధు పేరుతో అటు రైతాంగాన్ని ఇటు కార్మికుల్ని తీవ్రంగా దోచుకోవడానికి ప్రయత్నం చేస్తుందని వామపక్ష నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు సిపిఐ జిల్లా కార్యదర్శి బి శ్రీరామ్ మూర్తి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి ప్రకాష్ రావు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్లో వారు విలేకరులతో మాట్లాడుతూ జీడి యాజమాన్యాలు జూలై ఐదు నుండి ఆగస్టు 1 వరకు జీడి పరిశ్రమలు బందు పేరుతో యాజమాన్యాలు జీడి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని వారు విమర్శించారు. బందు పేరుతో నాటకాలు ఆడి అతి తక్కువ ధరకు జీడిపిక్కలు తీసుకోవడానికి డ్రామాలాడుతున్నారని వారు ఆరోపించారు .రైతులకు రెట్టింపు ఆదాయం ఇస్తామని ప్రగల్భాలు పలికిన బిజెపి రైతు ప్రభుత్వం అంటున్న వైసీపీ జీడీకి మద్దతు ప్రకటించి ఎందుకు కొనుగోలు చేయడం లేదని వారు ప్రశ్నించారు. జీడి పరిశ్రమలు బంధు చేస్తామని వ్యాపారులు ప్రకటనపై జిల్లా మంత్రులు ,స్పీకర్ స్పందించాలని వారు డిమాండ్ చేశారు .జీడి రైతాంగం గిట్టుబాటు ధరపై ఎందుకు మౌనంగా ఉన్నారు అని వారు ప్రశ్నించారు. మౌనం వీడి గిట్టుబాటు ధరపై మాట్లాడాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఆర్బికే లద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు .జీడి 80 కేజీలు బస్తాకు 16 వేల రూపాయలు ఇవ్వాలని కేరళ తరహాలో జీడి బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . జీడి పంటకు మద్దతు ధర వచ్చేవరకు ప్రజల మద్దతుతో దశలవారి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## రైల్వే అండర్ పాస్ ప్రారంభం

**కాకినాడ**

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తుని పట్టణ ప్రజలు డి మార్ట్ సమీపంలో ఉన్న రైల్వే గేట్ వలన ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతూ ట్రాఫిక్ సమస్యలు ఎదురుకొంటున్న పరిస్థితుల్లో కాకినాడ ఎంపి వంగ గీత రాష్ట్ర రోడ్ల రహదారులు మంత్రి దాడిశెట్టి రాజా ఎంతో పట్టుదలతో ఎన్నో సంవత్సరాల నుండి ప్రజలు ఎదురుకుంటున్న సమస్యను సుమారు ఐదు కోట్ల వ్యయంతో నిర్మించ బడిన రైల్వే అండర్ పాస్ నిర్మాణం పూర్తి చెయ్యడం జరిగింది ఈ రోజు కాకినాడ ఎంపి వంగ గీత రాష్ట్ర రోడ్ల రహదారులు మంత్రి దాడి శెట్టి రాజా చేతుల మీదుగా అత్యంత వైభవంగా నిరహిచడం జరిగింది ఈ కార్యక్రమంలో తుని పట్టణ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు రైల్వే వినియోగదారుల కమిటీ మెంబెర్ బోడపాటి శ్రీను మండల అధ్యక్షుడు పోతల రమణ తుని పట్టణ అధ్యక్షుడు రేలంగి రమణ గౌడ్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## హయత్ నగర్ లో హిజబ్ వివాదం

**రాచకొండ**

హయత్ నగర్ లో హిజాబ్ వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో హయత్ నగర్ జీ స్కూల్ యాజమాన్యం పై కేసు నమోదు అయింది. ముఖానికి స్కార్ఫ్ తో వచ్చిందంటూ ఒక పదవ తరగతి అమ్మాయిని స్కూల్ యాజమాన్యం ఇంటికి పంపింది. బాధిత విద్యార్థిని, హయత్ నగర్ కోర్టు న్యాయమూర్తి కూతురు. విద్యార్దిని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. దాంతో పోలీసులు బాలిక స్టేట్మెంట్ ఆధారంగా స్కూల్ యాజమాన్యం పై కేసు నమోదు చేసారు

## కాంగ్రెస్ లో చేరికలు

**హైదరాబాద్**

పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరిగాయి. అచ్ఛంపేట, వనపర్తి నియోజకవర్గాల నుంచి పలువురు కాంగ్రెస్ లో చేరారు. వనపర్తి, అచ్ఛంపేట,నియోజకవర్గం వంగూరు మండలానికి చెందిన పలువురు బీఆరెస్, బీజేపీ ల నుంచి కాంగ్రెస్ లో చేరారు. బీజేపీ, బీఆరెస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు.

## అభివృద్ధి లో సనత్ నగర్ ఆదర్శం

**హైదరాబాద్**

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం సనత్ నగర్ నియోజకవర్గంలో పర్యటించారు. సనత్ నగర్ లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ 50 సంవత్సరాల లో జరగని అభివృద్ధి 9 సంవత్సరాల లో జరిగింది. ఇక్కడ నుండి గెలిచి ముఖ్యమంత్రి, మంత్రులు గా పని చేసిన వారు నాడు ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. అనేక దీర్ఘకాలిక ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో పరిష్కరించాం. సుభాష్ నగర్ లో ఎంతో మంది ప్రాణాలు బలిగొన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరించాం. ఎన్ని కోట్ల నిధులైనా వెనుకాడం... ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని అన్నారు.

## గ్యాస్ సిలిండర్ తో అగ్ని ప్రమాదం

**మదనలపల్లె**

అన్నమయ్య జిల్లా మదనపల్లి సొసైటీ కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని పోలీసులు తెలిపారు. వన్ టౌన్ సీఐ మహబూబ్ బాషా కథనం మేరకు పట్టణంలోని సొసైటీ కాలనీలో కాపురం ఉంటున్న రెడ్డప్ప భార్య నాగలక్ష్మి(45), ఇంట్లో గ్యాస్ స్టవ్ పక్కన ఉన్న కట్టెల పోయ్యి వెలిగించి వీధిలో కూర్చుని పక్కింటి వాళ్ళతో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న విలువైన లక్ష రూపాయల సామాగ్రి అగ్నికి ఆహుతి అయింది. ఆలస్యంగా గుర్తించిన ఆమె మంటలను అదుపు చేసేందుకు అగ్ని మాపక అధికారులకు పోలీసులకు సమాచారం అందించింది. వారు వచ్చేలోపే అగ్నిప్రమాదంలో ఇంట్లో ఉన్న సుమారు లక్ష రూపాయలు విలువ చేస్తే ఫర్నిచర్ కాలిపోయింది. మాటలను అదుపు చేసే క్రమంలో నాగలక్ష్మి స్వల్పంగా గాయపడి మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. ఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పూటకో మాట చెబుతున్న కేసీఆర్

**మేడ్చల్**

పూటకు ఒక మాట చెప్తూ ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్ అన్నారు. బోడుప్పల్,పీర్జాది గూడా,మేడిపల్లి, పర్వతాపూర్ మున్సిపల్ కార్పోరేషన్ లలో సుమారు 110 కోట్ల ఎస్ ఎన్ డి పి పనులు జరగడం లేదని ఉప్పల్ బస్ డిపో ఎదురుగా నిరసన దీక్షా చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్ రెడ్డి,స్థానిక బోడుప్పల్ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వర్షా కాలంలో ఈ ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఇబ్బందులను కళ్ళారా చూసిన మేయర్లు,మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపనలు చేసి ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. రానున్నది వర్షా కాలం కాబట్టి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలి. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు.

# ధర్మవరంపై పరిటాల గురి

**అనంతపురం:**

రిటాల శ్రీరామ్ ధర్మవరం నియోజకవర్గంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత ఎన్నికల్లో రాప్తాడు నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన శ్రీరామ్ ఈసారి ధర్మవరం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. రాప్తాడు నుంచి పరిటాల సునీత పోటీ చేసే అవకాశాలున్నాయి. ధర్మవరంలోనూ పరిటాల కుటుంబానికి కొంత గ్రిప్ ఉండటంతో ఈసారి అక్కడి నుంచి పోటీ చేసి శాసనసభలోకి అడుగు పెట్టాలని శ్రీరామ్ భావిస్తున్నారు. సూరి వెళ్లిపోవడంతో... ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీకి పట్టుంది. 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీడీపీ తరుపున గోనుగుంట్ల సూర్యనారాయణ అలియాస్ వరదాపురం సూరి ధర్మవరం నుంచి గెలిచారు. అయితే 2019లో ఓటమి పాలయిన తర్వాత తనకున్న సమస్యల దృష్ట్యా ఆయన బీజేపీలో చేరారు. దీంతో ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి బాధ్యతలను పరిటాల శ్రీరామ్



కు చంద్రబాబు అప్పగించారు. తొలుత అయిష్టంగానే బాధ్యతలను తీసుకున్న శ్రీరామ్ తర్వాత ధర్మవరం నియోజకవర్గంలో తన పట్టును పెంచుకునే ప్రయత్నం గత కొంతకాలంగా చేస్తున్నారు. తరచూ పర్యటిస్తూ తనకంటూ ప్రత్యేక క్యాడర్ ను ఏర్పాటు చేసుకున్నారు. టీడీపీలోకి సూరి... ప్రస్తుతం బీజేపీలోనే వరదాపురం సూరి కొనసాగుతున్నారు. కానీ ఎన్నికల నాటికి వరదాపురం సూరి తిరిగి టీడీపీలోకి వస్తారన్న ప్రచారాన్ని ఆయన అనుచరులు చేస్తున్నారు. ఇది పరిటాల వర్గానికి మింగుడుపడటం లేదు. దీంతో వరదాపురం సూరిపై నేరుగా మాటల యుద్ధానికి దిగుతున్నారు. సూరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అక్రమాలను పరిటాల వర్గం తరచూ బయటపెడుతూ ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని ఎప్పటికప్పుడు పరిటాల శ్రీరామ్ పార్టీ అధినాయకత్వానికి తెలియజేస్తున్నారు. చంద్రబాబు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తామని చెప్పడంతో పరిటాల శ్రీరామ్ కు తనకు ధర్మవరం టిక్కెట్ గ్యారంటీ అని భావిస్తున్నారు. కానీ లాబీయింగ్ చేసి చివరి క్షణంలోనైనా వరదాపురం సూరి పార్టీలో చేరగలరని, లేకుంటే పొత్తులు కుదిరితే అటువైపు నుంచి సూరి వస్తారని భావించిన పరిటాల శ్రీరామ్ నేరుగా ఆయనపై విమర్శలు చేస్తున్నారు. మొత్తం మీద పరిటాల శ్రీరామ్ ధర్మవరం పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మరి సూరి చివరకు ఎగరేసుకుపోతారా? లేక శ్రీరామ్ కే సీటు దక్కుతుందా? అన్నది చూడాలి. అయితే ఇద్దరి మధ్య విభేదాలు మరోసారి సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి అడ్వాంటేజీగా మారే అవకాశాలు లేకపోలేదు.

# 'సోషలిస్ట్', 'సెక్యులర్' పదాలు మిస్సింగ్

**అధికారుల తప్పిదంపై మండిపాటు**

**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ కౌన్సిల్ రూపొందించిన పదో తరగతి సోషల్ టెక్ట్స్ బుక్స్ లో ఘోరమైన తప్పిదం జరిగింది. రాజ్యాంగ పీఠికను తప్పులతో ప్రచురించారు. అందులో సోషలిస్ట్, సెక్యూలర్ అనే పదాలు లేవు. దీన్ని ఆలస్యంగా గుర్తించడంతో వివాదం ప్రారంభమయింది. దీనిపై అధికారులు తప్పు జరిగిపోయిందని అనుకుం టున్నారు. అయితే ఆన్ లైన్ లో వెంటనే మార్చేశామని .. ఐదు లక్షల వరకూ సోషల్ టెక్ట్స్ బుక్స్ ముద్రించి పంపిణీ చేసినందున వెనక్కి తీసుకోలేమని వచ్చే ఏడాది తప్పు జరగకుండా చూస్తామని చెబుతున్నట్లుగా తెలుస్తోంది. మిగతా ఏ పుస్తకాల్లోనూ తప్పు దొర్లలేదని అన్నీ కరెక్ట్ గా ఉన్నాయన్నారు. మామూలుగా అయితే ఇది అచ్చు తప్పు అనుకునేవారు. కానీ భారత రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్టు, లౌకిక పదాలను తొలగించాలని కొన్ని వర్గాలు కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ నేతలు.. వారి మద్దతు దారులు వీటిని వ్యతిరేకిస్తున్నారు. 'సోషలిస్ట్', 'సెక్యులర్' పదాలను రాజ్యాంగ పీఠికలో 1977 ఎమర్జెన్సీ సమయంలో అప్రజాస్వామికంగా, పార్లమెంటులో ఎలాంటి చర్చ లేకుండా ప్రతిపక్ష నాయకులందరూ జైల్లో ఉన్నప్పుడు చేర్చారని ఆరోపిస్తున్నారు. భారత రాజ్యాంగంలోని పీఠికలో 'సోషలిస్ట్', 'సెక్యులర్' అనే భావన గణతంత్ర స్వభావాన్ని విస్తరిస్తోందని, ఇది ప్రభుత్వ సార్వభౌమ అధికారాలకు మాత్రమే పరిమితం చేయాలని, సాధారణ పౌరులకు, రాజకీయ పార్టీలకు, సామాజిక సంస్థలకు ఇది వర్తించదని కొన్ని సంఘాలు వాదిస్తున్నాయి. మొదట్లో ఈ రెండు పదాలు అసలు రాజ్యాంగంలో లేవు. ఎమర్జెన్సీ విధించినప్పుడు 1977 జనవరి 3న 42 రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్ లో ఎలాంటి చర్చ లేకుండా వీటిని ఆమోదించారు. రాజ్యాంగ పరిషత్ సభ్యులు కె.టి.షా సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చాలని మూడుసార్లు ప్రతిపాదించారు. మొదట 1948 నవంబర్ 15న లౌకిక అనే పదాన్ని చేర్చాలని ఆయన ప్రతిపాదించారు. రెండోసారి 1948 నవంబర్ 25న మూడవసారి డిసెంబర్ 3న ప్రతిపాదించాడు. ఈ మూడు సార్లు రాజ్యాంగ పరిషత్ దీనిని తిరస్కరించింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడా ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారని చెబుతూంటారు. సోషలిజం, లౌకికవాదం ప్రభుత్వ పనితీరుకు మాత్రమే పరిమితం కావాలని కొంత మంది వాదిస్తూ ఉంటారు. ప్రజా ప్రాతినిధ్యం చట్టం ప్రకారం రాజకీయ పార్టీలు లౌకికవాద సూత్రాలను అనుసరిస్తారని పార్టీ రిజిస్ట్రేషన్ సమయంలో ప్రకటించాలి. సెక్షన్ 123 ప్రకారం మతం ప్రాతిపదికన ఓట్లు అభ్యర్థించకూడదని చట్టం చెబుతోంది. ఈ క్రమంలో రాజ్యాంగ పీఠిక నుంచి ఆ రెండు పదాలను తొలగించాలని సుప్రీంకోర్టులో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి. అవి విచారణలో పెండింగ్లో ఉన్నాయి. ఈ దశలో ఆ రెండు పదాలను తొలగించిన పీఠిన టెక్ట్స్ బుక్ లో ప్రింట్ చేయడం సహజంగానే వివాదాస్పదమయింది.

# సింహపురిలో సిగపట్లు

**నెల్లూరు :**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మళ్ళీ వైసీపీ జెండా ఎగరవేసేందుకు స్కెచ్ వేస్తోంది ఆ పార్టీ నాయకత్వం. సిట్టింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వైసీపీకి దూరం కావడంతో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిని సమన్వయకర్తగా నియమించారు. శ్రీధర్ రెడ్డి పార్టీకి దూరమైన తర్వాత? రూరల్ పరిధిలో వైసీపీకి చెందిన 16 మంది ఆదాల వైపునకు వచ్చారు. మరో పదిమంది శ్రీధర్ రెడ్డితోనే కొనసాగుతున్నారు. శ్రీధర్ రెడ్డి వర్గంలోని కార్పొరేటర్ల డివిజన్ లలో తన వర్గానికి చెందిన నేతలను ఇంఛార్జీలుగా నియమిస్తున్నారు ఆదాల. కొన్ని చోట్ల ఇంకా సరైన నేతలు దొరకకపోవడంతో అక్కడ పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా డివిజన్ లలో అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. అక్కడ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలిస్తున్నారు. వారం రోజుల నుంచి ఆదాల దూకుడు పెంచడంతో స్థానిక నేతలు కొందరు ఆయన వైపు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని ఇప్పుడు సహకారం అందిస్తే తర్వాత తాను మరింత సహకరిస్తానని కింది స్థాయి నాయకులకు చెబుతున్నారట ఆదాల. తమ అనుచరులు అటువైపు చూస్తుంటడంతో కోటంరెడ్డి వర్గంలోని కార్పొరేటర్లకు పల్స్‌రేట్ పెరిగిపోతోందట. కొందరు ఆదాలతో ఫోన్‌లో టచ్‌లో ఉంటు?.. మద్దతిస్తామని చెబుతున్నారట. ఇప్పటికే నలుగురు కార్పొరేటర్లు ఆదాల వైపు వెళ్లేందుకు సిద్ధమైనా.. శ్రీధర్ రెడ్డి నుంచి వస్తున్న ఒత్తిడికి తలొగ్గి వెనుకాడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆదాల కొత్త స్కెచ్‌లో భాగంగా మొదట మహిళా కార్పొరేటర్ల భర్తలు.. వారి కుటుంబ సభ్యులను తన వైపునకు తిప్పుకుంటున్నారట. కుటుంబ సభ్యులు వచ్చేస్తే? తర్వాత వాళ్ళు రాక ఎక్కడికిపోతారన్నది ఆయన లాజిక్ అట. పైగా ప్రజల్ని, కార్పొరేటర్స్‌ని ఆకట్టుకునేందుకు అక్కడ అభివృద్ధి కార్యక్రమాల జోరు పెంచారట.పనులు జరుగుతుండడంతో ఆ డివిజన్ల ఇన్ఛార్జ్‌లకు ఆర్థికంగా ప్రయోజనం కూడా కలుగుతోంది. అలా ఎన్నికల సమయానికి అన్ని డివిజన్లలో బలమైన వర్గాన్ని సిద్ధం చేసుకోవాలన్నది ఎంపీ వ్యూహంగా చెబుతున్నారు. 2014 నుంచి 2019 వరకూ టిడిపి తరపున నియోజకవర్గ వ్యవహారాలను ఆదాల పర్యవేక్షించారు. ఆ సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని నేతలతో సత్సంబంధాలు కొనసాగించారు. ప్రస్తుతం వైసీపీలో ఉన్నా?అప్పుడు తనకు మద్దతిచ్చిన టీడీపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది. మొత్తం మీద సింహపురి సిత్రాలు రాబోయే రోజుల్లో కొత్తగా మారబోతున్నాయి.

# ఆగస్టు మొదటి వారంలో సిద్ధిపేట నుంచి కూకూ

**మెదక్ :**

సిద్ధిపేటకు రైలు సర్వీసులు ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. మనోహరాబాద్ – కొత్తపల్లి ప్రాజెక్టులో భాగంగా జులై చివరి నాటికి లేదా ఆగస్టు మొదటి వారంలో కానీ సిద్ధిపేట రైల్వే లైన్ సిద్ధం కాబోతుంది. ప్రస్తుతం సిద్ధిపేట సమీపంలో దుద్దెడ వరకు పూర్తి స్థాయి ట్రాక్ ఏర్పాటు పూర్తి కాగా.. అక్కడి నుంచి సిద్ధిపేట చేరువ వరకు తాత్కాలిక ట్రాక్ ఏర్పాటు పూర్తయింది. సిద్ధిపేట బైపాస్ వరకు ఆ పనులు పూర్తయిన తర్వాత శాశ్వత ప్రతిపాదికన పట్టాలు ఏర్పాటు చేస్తారు. ఆ వెంటనే రైల్వే సేఫ్టీ కమిషనర్ దుద్దెడ నుంచి సిద్ధిపేట వరకు ట్రాక్ సామర్థ్యాన్ని పరీక్షించి అనుమతి ఇవ్వగానే రైలు సేవలు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గజ్వేల్ వరకు లైన్ నిర్మాణం పూర్తయిన వెంటనే గతేడాది అక్కడి నుంచి నగరానికి ప్యాసింజర్ రైలు నడపాలని నిర్ణయించారు. కానీ కరోనా ఆంక్షలతో ఇందుకు ఆటంకం ఎదురు అయింది.తర్వాత ప్రారంభించాలని భావించినా గజ్వేల్ నుంచి నిత్యం నగరానికి ఓ రైలుకు సరిపడా ప్రయాణికులు ఉండరన్న అభిప్రాయంతో ఆ ప్రయత్నాన్ని అధికారులు విరమించుకున్నారు. కానీ ఇప్పుడు ఆ భావన తప్పని సిద్ధిపేట నుంచి సరిపడా సంఖ్యలో ప్రయాణికులు ఉంటారని నిర్ధారించుకున్న అధికారులు.. రోజుకు ఒకటి లేదా రెండు పుష్ పుల్ రైలు ట్రిప్పులు నడపాలని నిర్ణయించారు. సిద్ధిపేట నుంచి కాచిగూడకు ఆ రైలు నడుస్తుందని చెబుతున్నారు. ఇక తిరుపతికి, బెంగళూరుకు గానీ ముం బయికి గానీ ఎక్స్ ప్రెస్ రైళ్లను కూడా సిద్ధిపేట నుంచి నడపాలని అధికారులు యోచిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ప్రారంభం అవుతున్న కొన్ని ఎక్స్ ప్రెస్ లను సిద్ధిపేట నుంచి ప్రారంభిస్తే కరీంనగర్ ప్రయాణికులకు కూడా ఉపయోగపడుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. సిద్ధిపేట రైల్వే స్టేషన్ భవనం నిర్మాణం చాలా వేగంగా సిద్ధం అవుతోంది. దీంతో పాటు సరుకు రవాణాకు భారీ గూడ్సు యార్డును నిర్మిస్తున్నారు. ఇక్కడ మొత్తం ఐదు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒకటి మెయిన్ లైన్, రెండు లూప్ లైన్లు, ఒకటి గూడ్సు లైను, ట్రాక్ మెయింటెనెన్స్ కు వినియోగించే ట్రాక్ మిషన్ కోసం సైడింగ్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్ ఫామ్స్ 750 మీర్ల పొడవుతో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం నుంచి సరుకు రవాణా భారీగానే ఉంటుందని అంచనా వేస్తున్న రైల్వే శాఖ, అందుకోసం దాదాపు 800 మీటర్ల పొడవుతో గూడ్సు షెడ్డును ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే గజ్వేల్ లో 600 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేసిన సరుకు రవాణా యార్డు బాగా ఉపయోగ పడుతుంది. ఈ ప్రాంతానికి కావాల్సిన ఎరువులు రైలు ద్వారానే వస్తున్నాయి. ఈ ప్రాంతం నుంచి ధాన్యం క్రమం తప్పకుండా ఎగుమతి అవుతోంది. సిద్ధిపేటలో కూడా సరుకు రవాణా ప్రాంగణం అందుబాటులోకి వస్తే ధాన్యం తరలించేందుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# ఆత్మకూరు లో అట్టహాసంగా ప్రారంభమైన నూతన బస్టాండు

**నెల్లూరు**

దివంగత మంత్రి, మేకపాటి గౌతంరెడ్డి జ్ఞాపకార్థం నాలుగున్నర కోట్ల రూపాయలతో నిర్మించిన గౌతమ్ రెడ్డి మునిసిపల్ బస్ స్టాండ్ ను రాష్ట్ర మంత్రులు స్థానిక ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. మేకపాటి విక్రమ్ రెడ్డి సొంత నిధులు వెచ్చించి ఈ బస్టాండ్ నిర్మించిని విషయం తెలిసిందే. ఆత్మకూరు నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేసిన తన అన్న మేకపాటి గౌతమ రెడ్డి జ్ఞాపకార్థం ఈ బస్టాండ్ నిర్మించామని మేకపాటి కుటుంబ సభ్యులు తెలిపారు. మున్ముందు నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో కూడా ఇలాంటి బస్టాండ్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికి ఏ కష్టం వచ్చినా మేమున్నా మంటూ భరోసా కల్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజక వర్గానికి మేకపాటి విక్రమ్ రెడ్డి లాంటి ఎమ్మెల్యే దొరకటం మీ అదృష్టం అన్నారు. విక్రమ్ రెడ్డి కుర్రవాడు అని చాలా చక్కగా పనిచేస్తున్నాడని మళ్లీ మళ్లీ విక్రమ్ రెడ్డిని గెలిపించాలని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మేకపాటి విక్రమ్ రెడ్డి తండ్రి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ... తమ కుటుంబం నిరంతరం ప్రజల కోసమే పని చేస్తుందన్నారు. ఇప్పుడు కానీ ముందు ముందు గానీ ఎప్పుడు కూడా మేకపాటి కుటుంబం అంటే ఒక బ్రాండ్ ఇమేజ్ గా ఉంటుందని ఎలాంటి ఆరోపణలు రాకుండా జాగ్రత్తగా ఉంటామని చెప్పారు. మేము పది మందికి సహాయం చేసే వాళ్ళమే గాని ఎలాంటి ఆరోపణలు ఎదుర్కొనే స్థాయికి ఎప్పటికీ రామన్నారు. విక్రమ్ రెడ్డి చాలా మంచివాడని మనసున్న వ్యక్తి అని ప్రజలు మళ్ళీ మళ్ళీ ఆశీర్వదించాలని కోరారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గానికి కూడా తమ తమ్ముడు మేకపాటి రాజగోపాల్ రెడ్డిని త్వరలోనే అధిష్టానం ఇన్చార్జిగా నియమిస్తుందని ఆయనను కూడా ఆశీర్వదించాలని కోరారు.ఏది ఏమైనా ఆత్మకూరు నియోజకవర్గం లో నిర్మించిన మేకపాటి గౌతమ్ రెడ్డి బస్టాండు చాలా అద్భుతంగా ఉంది ఆస్ట్రేలియాలోని క్రికెట్ స్టేడియం అయిన గబ్బా స్టేడియం లాగా అద్భుతంగా తీర్చిదిద్దారు .త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో విక్రం రెడ్డిని భారీ మెజారిటీ గెలిపించి మంత్రివర్గంలోకి అడుగుపెట్టే విధంగా చూసుకుంటామని నియోజకవర్గ ప్రజలు నినాదాలు చేశారు

# కిషన్ రెడ్డికి హైకమాండ్ పిలుపు

**హైదరాబాద్ :**



కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సడెన్‌గా ఢిల్లీ వెళ్లారు. చాలా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన ఆయన్ని అధినాయకత్వం ఉన్నఫళంగా ఢిల్లీ రావాలని పిలుపునిచ్చింది. దీంతో షెడ్యూల్డ్ కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని ఆయన ఢిల్లీ వెళ్లారు. ఇప్పటికే అక్కడ ఈటల రాజేందర్, రాజగోపాల్ రెడ్డి ఉండనే ఉన్నారు. దీంతో బీజేపీలో ఏం జరుగుతుందో అన్న చర్చ మొదలైంది. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్‌టాపిక్‌గా మారుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ లెక్క మారిపోతున్నట్టు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీలో పరిణామాలపై ఆసక్తి నెలకొంది. 2023లో అధికారం మాదే అంటూ ప్రచారం చేసిన బీజేపీ లీడర్లు కర్ణాటక ఎన్నికల తర్వాత సైలెంట్ అయిపోయారు. అదే టైంలో కాంగ్రెస్ స్పీడ్ అందుకుంది. తెలంగాణలో రాజకీయాలు ఎప్పుడూ లేనంత డైనమిక్‌గా మారిపోతున్నాయి. ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న కాంగ్రెస్ ఒక్కసారిగా రైజ్ అయింది. ఇతర పార్టీల్లో ఉన్న అసంతృప్తులందర్నీ లాక్కునే పనిలో ఉంది. దీంతో బీజేపీలోకి వస్తామని చెప్పిన వాళ్లంతా కమలానికి హ్యాండిచ్చి కాంగ్రెస్‌చేతిలో చేయివేసి వెళ్లిపోతున్నారు. ఇది బీజేపీకి అతి పెద్ద సవాల్‌గా మారింది. వస్తామని చెప్పిన వాళ్లు వెళ్లిపోతే బీజేపీకి పెద్దగా సమస్య లేకపోవచ్చు కానీ... ఉన్న వారిలో చాలా మంది అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం మరింత కంగారు పెట్టిస్తోంది. అందుకే అధినాయకత్వం రంగంలోకి దిగింది. పార్టీలో ఉన్న అసంతృప్తులను పిలిచి మాట్లాడుతోంది. ఎన్నికల సమయంలో ముఖ్య నేతలు జారుకుంటే పెద్ద దెబ్బ బడే ఛాన్స్ ఉందని గ్రహించి దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. బీజేపీలో అసంతృప్త నేతల జాబితాలో మెయిన్‌గా ఇద్దరి పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. వాళ్లే ఈటల రాజేందర్, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి. చాలా రోజులుగా వీళ్లిద్దరూ సైలెంట్‌గా ఉంటున్నారు. వీళ్లకు బండి సంజయ్ వర్గానికి అసలు పడటం లేదని బీజేపీలో టాక్ గట్టిగా వినిపిస్తోంది. అందుకే వీళ్లు ఎప్పుడో ఒకప్పుడు పార్టీ మారిపోతారని విశ్లేషణలు ఉన్నాయి. అయితే పదే పదే ఆ ఆరోపణలు ఖండిస్తున్నప్పటికి కూడా ప్రచారం మాత్రం ఆగడం లేదు. దీంతో వాళ్లిద్దర్నీ అధిష్ఠానం పిలించింది. వారితోపాటు కిషన్ రెడ్డిని కూడా అధినాయకత్వం కాల్ చేసింది. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి జాయినింగ్స్‌పై ఆరా తీయబోతున్నట్టు కూడా తెలుస్తోంది. వీటిపైనే కాకుండా పొత్తుల అంశంపై కూడా బీజేపీ అధినాయకత్వం మాట్లాడబోతోందని టాక్ ఉంది. ఇప్పటికే తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో అమిత్‌షా సమావేశమయ్యారు. ఆ సమావేశంలో ఏం చర్చించారో బయటకు తెలియనప్పటికీ తెలంగాణలో బీజేపీ, టీడీపీ కలిసి వెళ్తాయనే వాదన ఉంది. దీనిపై ఏమైనా చర్చిస్తారా అన్న అనుమానం చాలా మందిలో ఉంది. అయితే దీనికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లేకుండా ఆ చర్చలు సాధ్యమేనా అన్నవారు ఉన్నారు. మరోవైపు మంత్రి కేటీఆర్ ఢిల్లీలోనే ఉన్నారు. మంత్రులతో సమావేశమవుతున్నారు. కొన్ని రోజులుగా ఈ రెండు పార్టీల మధ్య పెద్ద స్థాయిలో విమర్శలు, ఆరోపణలు వినిపించడం లేదు. లిక్కర్ స్కామ్‌పై కూడా బీజపీ మాట్లాడటం లేదు. ఈ పరిణామాలతో కిషన్‌రెడ్డితోపాటు మిగతా నేతలను అధినాయకత్వం పిలవడం చర్చనీయాంశమైంది.

# 15 లక్షల టన్నుల ఎరువులు సిద్ధం

**విజయవాడ :**

రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజనుకు అవసర మైన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్. హరికిరణ్ చెప్పారు. ఈ సీజన్లో పంటలకు 15 లక్షల టన్నుల ఎరువులు అవసరమ వుతాయని అంచనా వేశామని, ఇప్పటికే 10 లక్షల టన్ను లను రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్బీకేల్లో) అందుబాటులో ఉంచామని తెలిపారు. వచ్చే ఏడాది రబీ సీజన్ పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణ యించేందుకు జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం విశాఖ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్ కోసం ఐదులక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, ప్రస్తుతానికి నాలుగు లక్షల క్వింటా ళ్లను సిద్ధం చేశామని చెప్పారువీటిలో కోస్తాంధ్రకు వరి, రాయలసీమకు వేరుశనగ విత్తనాలు ఎక్కువగా అవసర మవుతాయని తెలిపారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం ఉండే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో అందుకు తగిన చర్యలు ఇప్పటినుంచే తీసుకుం టున్నామని తెలిపారు. ఎల్నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై అంతగా ఉండకపోవచ్చని వాతావరణశాఖ అంచనా వేసిందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా ఆగస్టు 15 వరకు రాష్ట్రంలో వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలపై అన్ని జిల్లాల నుంచి సమాచారాన్ని రప్పించి సమగ్ర కంటింజెన్సీ ప్రణాళికను రూపొందిం చినట్టు చెప్పారు.

# డ్రగ్స్ కేసులో అరెస్టయిన సినీ నిర్మాత కేపీ చౌదరి

**హైదరాబాద్ :**

డ్రగ్స్ కేసులో అరెస్టయిన సినీ నిర్మాత కేపీ చౌదరి కస్టడీ నివేదికలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. టాలీవుడ్ లో 12 మందికి డ్రగ్స్ సరఫరా చేశానని కేపీ వెల్లడించడంతో ఈ కేసు సంచలనంగా మారింది. కేపీని మరోసారి పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రముఖులు, నేతల కుమారులకు డ్రగ్స్ అమ్మినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కేపీ చౌదరిని పోలీసులు విచారించారు. కేపీ చౌదరి కాల్ లిస్ట్‌ను డీకోడ్ చేసిన పోలీసులు బిగ్ బాస్ కంటెస్టెంట్ ఆశురెడ్డితో పాటు తెలుగు సినిమాల్లో ఎన్నో ఐటెం సాంగ్స్ చేసిన నటితో వందల కొద్దీ కాల్స్ చేసినట్లు గుర్తించారు. కానీ ఈ కాల్స్‌పై కేపీ చౌదరి స్పందించకపోవడం గమనార్హం. అలాగే 12 మందికి డ్రగ్స్ సరఫరా చేసినట్లు కేపీ చౌదరి అంగీకరించాడు. వారిలో కొందరి పేర్లను మాత్రమే ఆయన వెల్లడించారు.రఘుతేజ, సనా మిశ్రా, సుశాంత్ రెడ్డి, నితినేష్, బెజవాడ భరత్, శ్వేత, రాగూర్ ప్రసాద్ లకు డ్రగ్స్ విక్రయించినట్లు తెలిపారు. కేపీ చౌదరి కేసులో ఫోన్ కాల్స్, బ్యాంకు లావాదేవీలు కీలకంగా మారాయి. కేపీ కాల్ లిస్టులో ఉన్న వారికి కూడా నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అతడి కాల్ డేటాను డీకోడ్ చేయడంతో బ్యాంకు ద్వారా పలువురికి చెల్లింపులు చేసినట్లు నిర్ధారణ అయింది. కాగా, వీటిలో 11 అనుమానాస్పద లావాదేవీలను గుర్తించిన పోలీసులు.. ఎందుకు చేశారనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఇక మరోవైపు సోషల్ మీడియా లో కొందరు బిగ్ బాస్ ఫేమ్ అషు రెడ్డి పేరును కూడా బయటకు లాగారు. దీంతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది ఈ భామ. టాలీవుడ్ డ్రగ్స్ కేసులో తనపై వస్తున్న ఆరోపణలను సోషల్ మీడియా వేదికగా ఆమె ఖండించారు.. సోషల్ మీడియా లో పేర్కొన్నట్లు తనకు ఎవరితో కూడా ఎలాంటి సంబంధాలు లేవని తనపై వచ్చిన వార్తలన్నీ కూడా తప్పుడు వార్తలని అషు రెడ్డి తెలిపింది.డ్రగ్స్ తో ఎలాంటి సంబంధం లేదు కేపీ చౌదరి మాకు తెలుసు.. కానీ ఎలాంటి వాడో మాకు తెలియదని సిక్కిరెడ్డి తల్లి మాధవి మండిపడ్డారు. నిర్మాత కేపీ చౌదరి డ్రగ్స్ కేసుకు సంబంధించి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సిక్కిరెడ్డి నివాసంలో పార్టీలు జరిగాయన్న వార్త మరింత కలకలం రేపిన విషయం తెలిసిందే.. ఈ క్రమంలో స్పందించిన సిక్కిరెడ్డి తల్లి మాధవి.. ఆ వార్తలను కొట్టిపారేసింది. కేపీ చౌదరి తమకు తెలిసిన వ్యక్తి మాత్రమేనని అన్నారు. అతను ఎలాంటి వాడో తమకు తెలియదని స్పష్టం చేశారు. తాము 2011లో అత్తాపూర్‌లో ఉన్నామని.. తాము ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోనే కేపీ చౌదరి నివాసం ఉండేవారని చెప్పారు. అప్పుడు కేపీ చౌదరితో తమకు పరిచయం ఉందని చెప్పారు. 2013లో తమను మాదాపూర్‌కు తరలించినట్లు తెలిపారు. అప్పటి నుంచి కేపీ చౌదరితో తనకు పెద్దగా పరిచయం లేదన్నారు. అయితే అప్పుడప్పుడూ ఫోన్ లో మాట్లాడేవాడని తెలిపారు. 2019లో సిక్కిరెడ్డి కూడా పెళ్లికి వచ్చాడని చెప్పారు. అయితే కేపీ చౌదరి కొంతకాలంగా గోవాలో ఉంటున్న సంగతి తెలిసిందే.కె.పి.చౌదరికి గతంలో ఉన్న పరిచయం కారణంగా వారం రోజుల పాటు నివాసం ఉండేందుకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. కేపీ చౌదరికి ఇళ్లు ఇస్తున్నామని కూడా సిక్కిరెడ్డికి చెప్పారని అన్నారు. కానీ కేపీ చౌదరి అలాంటి వ్యక్తి అని తమకు తెలియదన్నారు. ఆ ఇంట్లోనే ఉండమని కేపీ చౌదరిని చెప్పినట్లు తెలిపారు. ఆ ఇళ్లు సిక్కిరెడ్డి పేరు మీద ఉన్నాయని.. అందుకే ఈ సమస్య వచ్చిందన్నారు. సిక్కిరెడ్డి తల్లి ఎక్కడ బయటకు వెళ్లినా భర్తతో కలిసి వెళ్లేదని చెబుతోంది. సిక్కిరెడ్డి గేమ్ కోసం చాలా కష్టపడుతుందనేది అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు.అలాగే ఏప్రిల్ నెలాఖరు నుంచి సిక్కిరెడ్డి సరిగ్గా ఇక్కడికి రావడం లేదు. ఇప్పుడు జరుగుతున్న ప్రచారమంతా అబద్ధమని అన్నారు. సిక్కిరెడ్డి కెపి చౌదరితో ఒకట్రెండు సార్లు పరిచయం ఉండి ఉండవచ్చని అన్నారు. కేపీ చౌదరిని అంకుల్ అని పిలుస్తున్నారని అన్నారు. సిక్కిరెడ్డి ఇళ్లను పార్టీ కోసం వాడుకున్నట్లు మాత్రమే చెప్పారన్నారు. సిక్కిరెడ్డి డ్రగ్స్ వాడినట్లు కేపీ చౌదరి చెప్పలేదన్నారు. సిక్కి ఇంట్లో పార్టీలు జరిగాయని తనకు తెలియదని.. ఇక్కడ పార్టీలు పెట్టుకునే అవకాశం లేదన్నారు. కేపీ చౌదరి పార్టీ నిర్వహించి ఉంటే అక్కడి ప్రజలే తమకు చెప్పేవారని అన్నారు. అయితే.. డ్రగ్స్ తీసుకున్నట్టుగా, గోవాకు వెళ్లి పార్టీల్లో పాల్గొన్నట్టుగా ఆధారాలు ఉంటే చూపించాలని కూడా ప్రశ్నించారు. అసత్య ప్రచారం చేయవద్దని అన్నారు. ఈ అంశంపై ఎలాంటి పోరాటానికైనా సిద్ధమన్నారు.

# నీటి శుద్ధి ప్లాంట్ ను ప్రారంభించాలి

**మదనపల్లె**

వైసిపి ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేసి, నీటి శుద్ధి ప్లాంటును వినియోగంలోకి తీసుకురావాలని జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాసు చౌదరి సూచించారు. నేడు మదనపల్లె సమీపంలోని చిప్పిలి వద్దనున్న నీటి శుద్ధి ప్లాంటును ఆయన సందర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం రాయల్, రాష్ట్ర చేనేత విభాగ నాయకులు అడపా సురేంద్ర, మదనపల్లి రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, గడ్డం లక్ష్మీపతి, గండికోట లోకేష్, జనార్దన్, నవాజ్, సత్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామదాసు చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర శ్రేయస్సు కోసం జనసేనాని పవన్ కళ్యాణ్ హాలో ఏపీ... బైబై వైసిపి అన్న పిలుపు ఇచ్చారని అన్నారు. ఈ పిలుపును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని చెప్పారు. అందులో భాగంగానే నేడు ఈ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించడం జరిగిందన్నారు. ప్రజాధనంతో 90 శాతం పనులు పూర్తి చేసుకున్న ఈ నీటి శుద్ధి కేంద్రం ఇప్పుడు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా శిథిలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# త్వరలో ఢిల్లీకి షర్మిల!..కాంగ్రెస్ ముఖ్యనేతలతో భేటీ

**హైదరాబాద్ :**

వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారంటూ జోరుగా ఊహాగానాలు, ప్రచారం జరుగుతున్న వేళ ఇందుకు ఊతమిచ్చేలా కీలక పరిణామం చోటుచేసుకుంది. రెండు రోజుల్లో షర్మిల ఢిల్లీకి వెళ్తున్నారనే సమాచారం ఒక్కసారిగా గుప్పుమంది . ఈ పర్యటనలో ఆమె కాంగ్రెస్ ముఖ్యనేతలతో భేటీ అవుతారని ప్రచారం జరుగుతోంది. కాగా వైఎస్ షర్మిల ఇప్పటికే కార్ణటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పలుమార్లు భేటీ అయిన విషయం తెలిసిందే.ఢీకేతో భేటీ అయిన మరుసటి రోజే వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం, షర్మిల మధ్య చర్చలు జరిగినట్లుగా వార్తలు గుప్పుమన్న విషయం తెలిసిందే. ఏపీలో షర్మిల సేవలను వాడుకునేందుకు వీలుగా వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రతిపాదించారని.. విలీనానికి షర్మిల ఇష్టపడలేదనే వార్తలు వచ్చాయి. విలీనం లేదా పొత్తు ప్రతిపాదనలపై అటు హైకమాండ్, ఇటు షర్మిలకు మధ్య సమన్వయకర్తగా శివకుమార్ వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, మర్యాదపూర్వకంగానే ఈ భేటీ జరిగిందని షర్మిల చెప్పారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో



కాంగ్రెస్‌కు పూర్వవైభవం సాధించే దిశగా వీరిద్దరి మధ్య కీలక చర్చలు జరిగాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఏపీ కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్ర పోషించేందుకు షర్మిల అంగీకరిస్తే, ప్రస్తుతం వైఎస్ఆర్టీపీలో ఉన్న చాలా మంది నేతలు మళ్లీ సొంతగూటికి వచ్చే అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు.

**తెలంగాణలో భవిష్యత్ అంటున్న షర్మిల**

షర్మిలను పార్టీలో చేర్చుకుని పొగొట్టుకున్న చోటే వెతుక్కోవాలని హస్తం పార్టీ తలపిస్తోంది. కానీ షర్మిల మాత్రం తన భవిష్యత్తు తెలంగాణతోనేనని ఇదివరకే కుండబద్దలుకొట్టినట్టు చెప్పారు. తన చివరి శ్వాస వరకూ తెలంగాణ బిడ్డగా.. తెలంగాణ కోసం పోరాడుతూనే ఉంటానన్నారు. ఊహాజనిత కథలు కల్పిస్తూ తనకు, తెలంగాణ ప్రజలకు మధ్య అగాథాన్ని సృష్టించే విఫలయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పనిలేని.. పసలేని దార్శనికులకు తాను చెప్పేది ఒకటేనని, తన రాజకీయ భవితపైన పెట్టే దృష్టిని.. సమయాన్ని కేసీఆర్ పాలనపైన పెట్టాలన్నారు. కేసీఆర్ పాలనలో సర్వనాశనమై పోతున్న తెలంగాణ భవితపైన దృష్టి పెట్టాలని, కేసీఆర్ కుటుంబ అవినీతిని ఎండగట్టాలని సూచించారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరితే.. ఆమె సేవలను ఏపీలో వినియోగించుకుంటామంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు.

ఏపీలో పునర్వైభవం కోసం కాంగ్రెస్ తాపత్రయం..

ఏపీ పూర్వవైభవం కోసం కాంగ్రెస్ పార్టీ పాకులాడుతోంది. పీసీసీ నేతలను మార్చినప్పటికీ ఆ పార్టీకి ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత మొదటిసారిగా రఘువీరారెడ్డి ఆ తర్వాత శైలజానాథ్ పీసీసీ బాధ్యతలు చేపట్టారు. అయినా రాష్ట్రంలో కాంగ్రెస్ సత్తా చూపించలేకపోయింది. ప్రస్తుతం గిడుగురాజు రుద్రరాజు చేతిలో ఏపీ కాంగ్రెస్ పగ్గాలున్నాయి. రుద్రరాజు బాధ్యతలు తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ఆర్టీపీ అధినేత షర్మిల ను కాంగ్రెస్ చేర్చుకుని పూర్వవైభవం తేవాలని ఆ పార్టీ నేతలు ఆరాటపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# చిల్లకూరులో భూరక్ష పట్టాల పంపిణీ

**గూడూరు**

గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎన్నో సంవత్సరాలుగా ఉన్న చుక్కల భూములకు పరిష్కారాన్ని చూపారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్ వెల్లడించారు చిల్లకూరు తాసిల్దార్ కార్యాలయంలో భూ రక్ష పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాద్ ఎమ్మెల్సీ మేరీగా మురళి పాల్గొన్నారు చిల్లకూరు మండలం తాసిల్దార్ కార్యాలయం వద్ద జగనన్న భూ రక్ష పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఎమ్మెల్యే వరప్రసాద్ ,ఎమ్మెల్సీ మేరిగ మురళి,ఆర్డీవో కిరణ్ కుమార్ అర్హులైన రైతులకు పట్టాలు పంపిణీ చేశారు ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ ఎవ్వరికి రానటువంటి ఆలోచనలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని ఉన్నత కుటుంబంలో పుట్టి పేదరికం తెలియకపోయినా పేదల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు 40 సంవత్సరాల అనుభవం అని చెబుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని కోరారు ఎమ్మెల్సీ మేరిగా మురళి మాట్లాడుతూ 120 సంవత్సరాలుగా ఉన్న చుక్కల భూముల సమస్యలను శాశ్వత పరిష్కారం చూపిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని అవినీతి రహితంగా అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని భూ హక్కు ద్వారా వేలాది మంది రైతులకు భూమి కల్పించారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ దేవసేనమ్మ ,జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్ కుమార్, జెడ్పిటిసి యామిని ,మన్యం శ్రీనివాసులు ,ఏఎంసీ చైర్మన్ యమునమ్మ,ఎంపీపీ రమణమ్మ,నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి ,మీరా రెడ్డి ,బొమ్మిడి శ్రీనివాసులు ,మల్లు విజయ్ కుమార్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు

# ముద్రగడపై చేగొండి మండిపాటు

**కాకినాడ**

పవన్ కళ్యాణ్ పై రెండో లేఖ రాసిన ముద్రగడ పద్మనాభం పై మాజీ మంత్రి కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య మండిపడ్డారు. మొదటి లేఖ రాసినప్పుడే జనసైనికులు ఆటోచంప రెండు చెంపలు వాయించారని, అసలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన కాని నుండి కాపుల కోసం ఈ నేను చేశాడు అంటూ ప్రశ్నించారు మాత్రమే అన్నారుతెలుగుదేశం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత చంద్రబాబును కాపు వ్యతిరేకిగా చూపించడానికి మాత్రమే ముద్రగడ ఉద్యమం చేశారే తప్ప కాపుల సంక్షేమం దృష్ట్యా ఉద్యమం చేయలేదంటూ మండిపడ్డారుఇలాంటి మహానుభావుడు ఈరోజు పవన్ కళ్యాణ్ పై విసురులు విసరడానికి ముద్రగడ పద్మనాభం ఎక్కడ పవన్ కళ్యాణ్ ఎక్కడ ఈనేదో గొప్ప నాయకుడు అనుకుంటున్నాడని పవన్ కళ్యాణ్ కి మించిన నాయకుడిగా అనుకుంటున్నాడని పవన్ కళ్యాణ్ రోడ్డు మీదకు వస్తే వేళల్లో జనం బయటకు వస్తే ఈ ముద్రగడ బయటకు వస్తే ఆయన వెంట పదిమంది కూడా ఉండరంటూ అది పవన్ కళ్యాణ్ కు ముద్రగడకు ఉన్న తేడా అంటూ ఇటువంటి నాయకుడు పవన్ కళ్యాణ్ కంటే గొప్పవాడిని అనిపించుకోవడానికి చేస్తున్న ప్రక్రియ ఈ ఉత్తరాలు తప్ప ఈయన రాస్తున్న ప్రతి ఉత్తరం ఈయన సొంత స్క్రిప్ట్ కాదని జగన్మోహన్ రెడ్డి స్క్రిప్ట్ అంటూ ఆరోపించారు ఇప్పటికే జన సైనికులంతా బుద్ధి చెప్పారని అది సరిపోలేదా అనే ఉద్దేశంలో ఉన్నాడా తెలియదంటూ పిఠాపురంలో పోటీ చేయాలంటూ పవన్ కళ్యాణ్ కు సవాలు చేయటం ఏమిటి పద్మనాభం మీద పోటీ చేయడానికి ఒక సామాన్య జనసైనికుడు చాలు ఒక జన సైనికుడు నిలబెట్టిన ఈయన గొప్పగా నెగ్గితే అప్పుడు మాట్లాడతా అంటూ తిరిగి సవాల్ చేశారు ఇప్పటికైనా అనవసరంగా ఊహించుకోకుండా పవన్ కళ్యాణ్ కంటే పెద్దవాడిని అయిపోదామని ఊహించుకుని మోసపోవద్దని ఉత్తరాల ప్రక్రియ మానుకుని ఇంట్లో కూర్చుని జపం చేసుకోవాలంటూ సలహా ఇచ్చారు

# పేద విద్యార్థుల చదువు బాధ్యత అంతా జగన్ మావయ్యదే

**నంద్యాల**

రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థి చదువు బాధ్యత అంతా మీ జగన్ మావయ్య చూసుకుంటున్నారని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని కేఎన్ఎం మున్సిపల్ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో ఆల్ మైనార్టీస్ ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నంద్యాల డివిజన్ పరిధిలోని ఉర్దూ మీడియం పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబన్నీసా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, డిక్షనరీ అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన ఉపాధ్యాయులకు, ప్రోత్సాహం అందించిన విద్యార్థుల తల్లిదండ్రులను అతిథులు సన్మానించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అందుకోవాలని నంద్యాలకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రధానంగా విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఓటు హక్కు లేని విద్యార్థులతో అవసరం లేదని విస్మరించారని తెలిపారు. రాష్ట్రం భవిష్యత్తులో బాగుండాలంటే విద్య ఒక్కటే మార్గమని తలచిన సీఎం జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థుల బంగారు చదువులకు ఎవ్వరూ, మరెక్కడా వ్యయం చేయనంతగా ఖర్చు చేశారని తెలిపారు. మీ జగన్ మావయ్య మీ చదువులకు ఎంత ఖర్చయినా



వెనుకాడడని నిరూ పించారన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, నాడు నేడు ద్వారా పాఠశాలలు, కళాశాలల ఆధునీకరణ, నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. దేశ చరిత్రలో విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టారని, ఇటువంటి విజన్ ఉన్న సీఎం ను మరెన్నడు చూడలేమని తెలిపారు. అలాగే నంద్యాల నియోజక వర్గంలో విద్యాభివృద్ధికి ఆర్డిటీ వారి సహకారంతో 3.5కోట్లతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నూతన తరగతి భవనాల నిర్మాణం, ఏపీ మోడల్ నిర్మాణం పనులు ప్రారంభం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆడిటోరియం, ఉర్దూ కళాశాల స్థల సేకరణ, నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం, ఐటిఐ కళాశాల ఏర్పాటు, అనేక పాఠశాలల రూపురేఖలను మారుస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టారు. ఉర్దూ కళాశాల అధ్యాపకుల నియామకానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉన్నత స్థానంలో ఉండాలంటే మనమిచ్చే ఆస్తి ఒక్కటేనని అది చదువు మాత్రమేనని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ బడుల్లో డిజిటల్ పాఠాలు బోధించే విధానం అమల్లోకి రానుందన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి డా రాజశేఖర రెడ్డి ముస్లిం మైనార్టీ లకు 4శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో ఫీజ్ రీయింబర్స్ మెంట్ కల్పించారని పేర్కొన్నారు. తండ్రి బాటలోనే అంతకు మించిన కార్యక్రమాలను జగన్ మోహన్ రెడ్డి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగి శెట్టి శ్రీధర్, పామ్ షా వలి, కౌన్సిలర్ అబ్దుల్ మజీద్, కో ఆప్షన్ మెంబర్ సలాముల్ల, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్దం శివరాం, స్కూల్ హెచ్ఎం అసదుల్లా హుస్సేన్, ఆల్మేవా ప్రతినిధులు అబులైజ్, ఇమ్రాన్ పాష, మాలిక్ బేగ్, ముర్తుజ, అమీరుద్దీన్, షేక్ మహమ్మద్, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# మరో డ్రగ్స్ లింక్

**హైదరాబాద్ :**

టాలీవుడ్‌లో డ్రగ్స్ కేసు సంచలనంగా మారింది. కబాలి చిత్ర నిర్మాత కెపి చౌదరి అలియాస్ కృష్ణ ప్రసాద్ చౌదరి 100 గ్రాముల కొకైన్‌తో పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోవడం కలకలం సృష్టించింది. రెండు రోజుల దర్యాప్తు తర్వాత పోలీసులు రిమాండ్ రిపోర్టు బయటపెట్టారు. ఈ రిపోర్టులో మొత్తం 12 మందికి డ్రగ్స్ అమ్మినట్లు కేపీ చౌదరి దర్యాప్తులో అంగీకరించినట్లు పేర్కొన్నారు. వీరిలో ప్రముఖ వ్యక్తుల పేర్లు వెలుగులోకొచ్చాయి. ఓ బిగ్ బాస్ బ్యూటీతోపాటు ఇతర ఆర్టిస్టులతో వందల సార్లు ఫోన్లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఆయన ఫోన్ కాల్స్ లిస్ట్‌లో ఇద్దరు హీరోయిన్ల పేర్లు కూడా ఉన్నాయి. ఆ హీరోయిన్లు ఎవరు అనే విషయాన్ని మాత్రం ప్రస్తుతానికి పోలీసులు బయట పెట్టడం లేదు. కేపీ చౌదరి నిర్మాత కాబట్టి సినిమాల విషయమై మాట్లాడాడా, లేదా డ్రగ్స్ వ్యవహారం ఏమైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేపీ చౌదరి బ్యాంక్ లావాదేవీలను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు. అతని ఖాతాలో 11 అనుమానస్పద లావాదేవీలను గుర్తించారు.ఈ కేసులో దర్యాప్తు చేస్తున్న కొద్దీ టాలీవుడ్‌లో ఉన్న లింకులు బయటపడుతున్నాయి. పలువురు ఫేమస్ ఆర్టిస్టులతో దిగిన ఫొటోలు అతని ఫోన్లో లభ్యమయ్యాయి. వారిలో ఓ సీనియర్ నటి కూడా ఉంది. ఐతే పోలీసులు ఆమె ఎవరనే విషయాన్ని బయటపెట్టడం లేదు. కేపీ చౌదరి సన్నిహితంగా మెలుగుతున్నట్టుగా ఆ ఫోటోల్లో ఉంది. నటి సురేఖా వాణి, ఆమె కూతురితో కలిసి కేపీ చౌదరి దిగిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. డ్రగ్స్ కేసులో వీరి పేర్లు కూడా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే కస్టడీకి పర్మిషన్ ఇచ్చిన తర్వాత కేపీ చౌదరి పూర్తిస్థాయిలో దర్యాప్తుకు సహకరించడం లేదు. పోలీసులు తన మీద ఫాల్స్ అలగేషన్స్ వేస్తున్నారని ఆయన అంటున్నారు. ఈ వ్యవహారం ఎంత దూరం వెళ్లబోతుందో, ఎవరెవరి పేర్లు బయటికి వస్తాయో వేచి చూడాల్సిందే.

# కింగ్ ఆఫ్ కోథా' క్యారెక్టర్స్ విడుదల



జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ ' కింగ్ ఆఫ్ కోథా' మరో ఎక్సయిటింగ్ మాస్ ఎంటర్‌టైనర్ అవుతుందని భరోసా ఇచ్చింది. లక్షలాది అభిమానుల ఉత్సాహాన్ని ఇస్తూ ఎడ్జీ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోను మేకర్స్ విడుదల చేసారు.క్యారెక్టర్ అనౌన్స్‌మెంట్ వీడియో సినిమాలోని కీలక పాత్రలను ఇంట్రస్టింగ్ స్కెచ్ ఫార్మాట్‌లో పరిచయం చేస్తుంది. దుల్కర్ సల్మాన్ 'కింగ్' పాత్రలో రిఫ్రెష్‌గా ఇంటెన్సివ్‌గా తనదైన ముద్రవేశారు.ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ తో పాటు డ్యాన్సింగ్ రోజ్, ప్రసన్న, ఐశ్వర్య లక్ష్మి, నైలా ఉష, చెంబన్ వినోద్, గోకుల్ సురేష్, షమ్మి తిలకన్, శాంతి కృష్ణ, వడ చెన్నై శరణ్, అనిఖా సురేంద్రన్ వంటి ప్రముఖ తారాగణం ఉంది.ఈ చిత్రాన్ని ఈ సంవత్సరం ఓనం పండుగ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. అభిలాష్ జోషి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, షాన్ రెహమాన్, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూర్చారు.జూన్ 28న టీజర్‌ను మేకర్స్ విడుదల చేయనున్నారు.జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం యూనిక్ కంటెంట్, ఎంటర్ టైన్ మెంట్ తో ప్రేక్షకులను అలరించనుంది.

# వ్యూహం..టీజర్ విడుదల




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం, ఆ తర్వాత జరిగిన పరిస్థితుల నేపథ్యంలో సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కిస్తున్న సినిమా 'వ్యూహం' అతి త్వరలో సినిమా విడుదల కానుంది. శనివారం టీజర్ విడుదల చేశారు. 'వ్యూహం' ప్రారంభమే వైఎస్ రాజశేఖర్ రెడ్డిని చూపించారు రామ్ గోపాల్ వర్మ. ముఖ్యమంత్రి హోదాలో మరణానికి ముందు చేసిన హెలికాప్టర్ విజువల్స్ ఉపయోగించారు. వైయస్సార్ మరణం, ఆ తర్వాత వైయస్సార్ తనయుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిపై సీబీఐ కేసులు పెట్టడం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపనకు దారి తీసిన పరిస్థితులను 'వ్యూహం'లో చూపించనున్నారని టీజర్ చూస్తే అర్థం అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, జగన్ మోహన్ రెడ్డికి మేలు చేసే విధంగా రామ్ గోపాల్ వర్మ సినిమాలు తీస్తారని ముద్ర పడింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఆయన సినిమాలు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 'వ్యూహం' టీజర్ చివరి డైలాగుల్లో కూడా చంద్రబాబు ప్రస్తావన ఉంది. 'అలా ఆలోచించడానికి చంద్రబాబును కాదు' అని జగన్ పాత్రధారి చేత డైలాగ్ చెప్పించారు. 'వ్యూహం' సినిమాలో జగన్ మోహన్ రెడ్డి పాత్రలో తమిళ నటుడు, 'రంగం' ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన అజ్మల్ నటిస్తున్నారు. ఆయన జోడీగా భారతి పాత్రలో మానస నటిస్తున్నారు. శ్రీ రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్‌కుమార్ నిర్మిస్తున్న చిత్రమిది. 'వ్యూహం' బయోపిక్ కాదని రామ్ గోపాల్ వర్మ చెబుతున్నారు. బయోపిక్ కంటే చాలా లోతైన రియల్ సినిమా అంటున్నారు. ఇందులో (వ్యూహం సినిమాలో) నూటికి నూరు పాళ్లు నిజాలే ఉంటాయని గతంలో కూడా ఓ సందర్భంలో ఆర్జీవీ తెలిపారు. మామూలుగా ఆర్జీవి ఏం చేసినా ట్రెండ్ అవుతుంది. అందులోనూ రాజకీయాలతో ముడి పడిన కామెంట్స్ చేయడం, రాజకీయాలపై సినిమాలు తీయడం వర్మకు వెన్నతో పెట్టిన విద్య.గతంలో రామ్ గోపాల్ వర్మ తీసిన రాజకీయ నేపథ్య చిత్రాలు నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో వాడి వేడి చర్చలకు దారి తీశాయి. ఇప్పుడీ 'వ్యూహం' టీజర్ కూడా యూట్యూబ్, డిజిటల్ మీడియాలో ట్రెండ్ అయ్యేలా ఉంది'వ్యూహం' సినిమాకు ప్రస్తుతం ఏపీలో అధికారంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అండదండలు పుష్కలంగా ఉన్నాయని ప్రజల్లో కొందరు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల తాడేపల్లి వెళ్లి మరీ జగన్ రెడ్డిని వర్మ కలిసి రావడం ఆ వ్యాఖ్యలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. సినిమా విడుదల సమయంలో ఈ సినిమా మీద ఇంకెన్ని కామెంట్స్ వస్తాయో చూడాలి. సాధారణంగా తనపై ఎన్ని విమర్శలు వచ్చినప్పటికీ 'డోంట్ కేర్' అన్నట్లు రామ్ గోపాల్ వర్మ వ్యవహరిస్తూ ఉంటారు. ఇంకా చెప్పాలంటే ఎంజాయ్ చేస్తూ ఉంటారు. తనకు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని చెబుతారు. మరి, ఈ సినిమా గురించి ఏం చెబుతారో చూడాలి. ఈ సినిమా విడుదల తేదీ గురించి చాలా మంది ఎదురు చూస్తున్నారు.

# ఎమోషనల్ థ్రిల్లర్ 'బ్రీత్' టీజర్ లాంచ్



విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు పెద్ద కుమారుడైన నందమూరి జయకృష్ణ... బసవతారక రామ క్రియేషన్స్ పేరుతో నిర్మాణ సంస్థని ఏర్పాటు చేసి, తొలి చిత్రంగా తన తనయుడు చైతన్యకృష్ణని హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న ఎమోషనల్ థ్రిల్లర్ 'బ్రీత్'. ఈ చిత్రానికి వంశీకృష్ణ ఆకెళ్ళ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం టీజర్ ని లాంచ్ చేశారు మేకర్స్.టీజర్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత నందమూరి జయకృష్ణ మాట్లాడుతూ.. 'బ్రీత్' ఎమోషనల్ థ్రిల్లర్. అన్ని వర్గాల వారిని అలరించేలా వుంటుంది. సినిమాకి పని చేసిన అందరికీ కృతజ్ఞతలు. మా అమ్మానాన్నల పేరుతో బసవతారక రామ క్రియేషన్స్ బ్యానర్ పై ఈ సినిమాని నిర్మిస్తున్నాం. ఈ చిత్రాన్ని మా అమ్మానాన్నల అంకితం చేస్తున్నాను. నాన్నగారి శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ఈ సినిమా టీజర్ ని విడుదల చేయడం ఆనందంగా వుంది" అన్నారు.హీరో చైతన్యకృష్ణ మాట్లాడుతూ.. వంశీకృష్ణ ఆకెళ్ళ గారు చక్కని కథ, కథనంతో ఈ చిత్రాన్ని మలిచారు. ప్రతి పాత్ర, సన్నివేశం అర్థవంతంగా వుంటుంది. నా తొలి చిత్రానికి వంశీకృష్ణ లాంటి దర్శకులతో చేయడం ఆనందంగా వుంది. ఈ సినిమా తో నాకు ఆయన బ్రీత్ ఇచ్చారు. హీరోయిన్ వైదిక అద్భుతంగా నటించింది. ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత వుంది. ఈ రోజు నేను మీ ముందుకు వచ్చాను అంటే దానికి కారణం మా నాన్నగారు. తాతగారు నాన్నమ్మ.. నాన్నగారు.. మీ అందరికీ ఆశీస్సులతో పరిచయం అవుతున్నాను. మీఅందరి బ్లెస్సింగ్స్ కావాలి" అన్నారుదర్శకుడు వంశీకృష్ణ ఆకెళ్ళ.. మా నిర్మాత జయకృష్ణ, హీరో చైతన్య కృష్ణలకి జీవితాంతం రుణపడివుంటాను. ఇంత మంచి థ్రిల్లర్ ని చేసే అవకాశం ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు. బ్రీత్.. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్. సినిమా చూస్తున్నపుడు షాక్, ఎక్సయిట్ మెంట్. థ్రిల్ అన్నీ ఫీలవుతారు. కమర్షియల్ ఎలిమెంట్స్ కూడిన యూనిక్ థ్రిల్లర్ ఇది. ఈ సినిమాకి కర్త కర్మ క్రియ అన్నీ చైతన్యకృష్ణ. చైతన్య గారు అద్భుతమైన వ్యక్తి. జయకృష్ణ గారి నిర్మాణం సినిమా చేయడం నా అదృష్టం. ఆ అవకాశాన్ని విజయవంతమైన స్థాయికి తీసుకెళ్ళానని భావిస్తున్నాను. టీం అందరూ హార్డ్ వర్క్ చేశారు.ఖచ్చితంగా బ్రీత్ ప్రామెసింగ్ మూవీ అవుతుంది" అన్నారు.

# 'నిదురించు జహాపన' మోషన్ పోస్టర్ లాంచ్




ప్రేమించుకుందాం రా , సూర్యవంశం, మనసంతా నువ్వే లాంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులని అలరించిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ వర్ధన్ హీరోగా ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో ఆర్ ఎంటర్ టైన్మెంట్స్, శ్రీజ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సామ్ జి, వంశీ కృష్ణ వర్మ ఓ యూనిక్ ఎంటర్ టైనర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'నిదురించు జహాపన' అనే ఆసక్తికరమైన టైటిల్ ని లాక్ చేసిన మేకర్స్ మోషన్ పోస్టర్ ని లాంచ్ చేశారు.

మోషన్ పోస్టర్ చాలా ఇంట్రెస్టింగ్గా ఉంది. సముద్రతీరంలో హీరో మంచంపై నిద్రపోతుండగా.. "చాలా ప్రశాంతంగా వున్న ఇతని జీవితంలోకి ఒక రోజు నిద్రముంచుకొచ్చింది నాయిన" అనే వాయిస్ వినిపిస్తూ..వచ్చింది నిదరే అయినా అది ప్రమాదకరం అనే అర్థం వచ్చేట్లు డేంజర్ బోర్డ్ చూపించడం.. తర్వాత బుర్రకథ స్టైల్ లో వినిపించిన కొన్ని లైన్స్ చాలా క్యూరియాసిటీని పెంచాయి.

ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ.. చైల్డ్ ఆర్టిస్ట్ గా ప్రేమించుకుందాం రా, సూర్యవంశం, మనసంతా నువ్వే.. చిత్రాలు చేశాను. ఇప్పుడు కథానాయకుడిగా "నిదురించు జహాపన' చేస్తున్నాను. మోషన్ పోస్టర్ మీ అందరికీ నచ్చడం ఆనందంగా వుంది. ఈ సినిమా కోసం అందరూ చాలా హార్డ్ వర్క్ చేశాం. ఇది గ్రేట్ జర్నీ. అనూప్ రూబెన్స్ గారు వండర్ ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ప్రసన్న గారు చాలా అద్భుతమైన స్క్రిప్ట్ ఇచ్చారు. మీ అందరినీ తప్పకుండా అలరిస్తుంది. జీవితాంతం సినిమాల్లోనే వుంటాను. సినిమా నా ప్రాణం. మీ అందరినీ అలరించడానికి నా శక్తిమేర ప్రయత్నిస్తాను"అన్నారు

ప్రసన్న కుమార్ దేవరపల్లి మాట్లాడుతూ.. ఒక మనిషి నిద్రపోయిన తర్వాత కలలు వస్తాయి. ఐతే ఆ కల గురించి ఓ పది నిమషాలు చెప్పుకుంటాం. మిగతా సమయం అంతా ఏం జరుగుతుందనేది ఒక క్వశ్చన్ మార్క్. అలాగే ఈ సినిమాలో మా హీరో ఆరు నెలలు కంటిన్యూస్ నిద్రపోతూనే వుంటాడు. అందుకే ఈ టైటిల్ పెట్టాం. దాదాపు సముద్ర నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ ప్రయాణంలో చాలా సవాళ్ళు ఎదురుకున్నాం. మా నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా సినిమాని నిర్మించారు. అందరం టీం వర్క్ గా ఈ సినిమా చేశాం. ఆనంద్ వర్ధన్ డైరెక్టర్స్ హీరో. చాలా చక్కగా నటించారు. చిన్నప్పుడు తను బాలనటుడిగా చేసిన అనుభవం అంతా ఇందులో కనిపిస్తుంది. అనూప్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. సినిమా తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది." అన్నారు

అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ.. దర్శకుడు ప్రసన్న, హీరో ఆనంద్ వర్ధన్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ప్రసన్న చాలా మంచి దర్శకుడు అవుతారు. కథ చాలా నచ్చింది. పాటలన్నీ బాగా వచ్చాయి. తప్పకుండా ఈ సినిమా అందరికీ ఎంటర్ టైన్ చేస్తుంది" అన్నారు.రోష్ని సాహోత మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. చాలా స్పెషల్ మూవీ ఇది. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుంది" అన్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950